## రిపోర్టర్లు కావలెను

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467



బుధవారం 10.04.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -86 www.journalistfile.com పేజీలు 6 వెల : రూ.5.00


# అమ్మో.. మాఫియా

- అడ్డుకుంటే దాడులే
- చెలరేగిపోతున్న ఇసుక స్మగ్లర్లు
- కృష్ణానదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. కూలీల చేత మాత్రమే తవ్వకాలు చేసి ఇసుక తరలించాలన్న నిబంధన మచ్చుకైనా అమలు కావడం లేదు. ఇసుక దొంగలు అడ్డగోలుగా కృష్ణానదిలో తవ్వకాలు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. అనుమతులు తీసుకున్న విస్తీర్ణం దాటి నదిని గుల్ల చేస్తున్నారు. భారీ పొక్లెయిన్లు పెట్టి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అత్యంత లోతుకు తవ్వడం వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయని నదీ తీర గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నా అరణ్యరోదనే అవుతోంది. భారీ లారీల రాకపోకలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయని వాపోతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. అవకాశం ఉన్నప్పుడే వీలైనంత దోచుకోవాలన్న లక్ష్యంతో అధికారులు ఇసుక మాఫియాను

2లో

# ఆర్టీసీలో దొంగోడు !

## ప్రైవేటు ట్రావెల్స్ కోసం ఆర్టీసీని బలి చేస్తున్న అధికారి




**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విశాఖ నగర జనాభా 20 లక్షలు దాటింది. ఇక్కడి నుంచి రాష్ట్రం నలుమూలలకు, హైదరాబాద్ కు ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. హైదరాబాద్ కు రైళ్లలో అయితే థర్డ్ ఏసీ టికెట్లు నెల రోజులు ముందుగానే అయిపోతున్నాయి. స్లీపర్ బోగీలు తక్కువగా ఉండడంతో రెండు నెలల ముందుగానే సీట్లు నిండుకుంటున్నాయి. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రెండు చేతులా ఆదాయాన్ని ఆర్జించాల్సిన ఆర్టీసీ చేతులు కట్టేసుకుంది. దీంతో తెలంగాణ ఆర్టీసీ, ప్రయివేటు ట్రావెల్స్ ఆ అవకాశాన్ని చేజిక్కించుకున్నాయి. విశాఖ నుంచి ఏసీ బస్సులను నడుపుతూ ప్రయాణికుల ఆదరణ చూరగొంటున్నాయి. మరి మన ఆర్టీసీ మాత్రం ప్రయాణ సేవలు ఎందుకు అందించలేకపోతోంది అని ఆరా తీసిన 'జర్నలిస్ట్ ఫైల్' కు ఆర్టీసీ లో ఉన్నత హోదా అనుభవిస్తూ, సంస్థ సొమ్ముని జీతంగా తీసుకుంటూ... ప్రైవేట్ ట్రావెల్స్ వారితో కుమ్మక్కై భారిగా లంచాలు తీసుకుంటూ ఆర్టీసికే వెన్నుపోటు పొడుస్తున్న ఓ అధికారి బాగోతం బయటపడింది ప్రైవేట్ ట్రావెల్స్ వారి నుండి భారీ మొత్తంలో ముడుపులు అందుకుంటున్న ఆ అధికారి... ప్రైవేట్ ట్రావెల్స్ కు లబ్ది చేకూర్చేందుకే విశాఖపత్నం నుండి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచనివ్వకుండా అడ్డుకుంటూ, ఆర్టీసీ ఆదాయానికి భారిగా గండి కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గతంలో విశాఖ డిపోనకు రెండు వెన్నెల (స్లీపర్ ఏసీ) సర్వీసులు ఉండేవి. వాటిని కొన్నాళ్లపాటు హైదరాబాద్ తిప్పిన ఆర్టీసీ అధికారులు, తర్వాత ప్రయాణికుల నుంచి ఆదరణ లేదని విజయవాడ వరకు నడిపారు. అనంతరం విశాఖపట్నం డిపో నుంచి నిర్వహించలేకపోతున్నామని చేతులెత్తేయడంతో వాటిని విజయవాడ ఆటోనగర్ కు పంపేశారు. ప్రస్తుతం ఆటోనగర్ డిపో నుంచి ఆ రెండింటినీ విశాఖ వరకు తిప్పుతున్నారు. చివరికి విశాఖ ప్రజలకు అవసరమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలోనూ వైఫల్యం చెందింది.

విశాఖపట్నం – హైదరాబాద్ రూటు తెలంగాణా ఆర్టీసీకు, ప్రైవేటు ట్రావెల్స్ కు లాభాల పంట పండిస్తుంటే... ఏపీ ఆర్టీసీ కు మాత్రమే లాభసాటిగా లేకుండా బస్సు సర్వీసులు తగ్గించడం ఏంటి అనేది ప్రజలకు అర్ధం కానీ ప్రశ్న. దీనికి కారణం ప్రైవేటు ట్రావెల్స్ నుంచి అందుతున్న ముడుపులే అంటున్నారు.

**కళ్లు తెరవని ఆర్టీసీ అధికారులు..**

తెలంగాణ ఆర్టీసీ గతంలో విశాఖ నుంచి హైదరాబాద్ కు ఒక లాహరి ఏసీ స్లీపర్ బస్సును మాత్రమే నడిపేది. దాని సేవలు బాగుండడంతో ప్రయాణికుల ఆదరణ పెరిగింది. దీంతో బస్సుల సంఖ్యను మూడుకు పెంచింది. మరో పక్క ప్రయివేటు ట్రావెల్స్ కూడా నగరం నుంచి హైదరాబాద్ కు 20 ఏసీ స్లీపర్ బస్సులు నడుపుతున్నాయి. వాటికీ ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమైన విశాఖ నుంచి ఆర్టీసీ కేవలం ఒక స్లీపర్ బస్సు (నైట్ రైడర్) మాత్రమే నడుపుతోంది. ఇందులో దిగువన సీట్లు, పై భాగంలో బెర్తులుండేలా రూపొందించారు. దీనికి ప్రయాణికుల నుంచి ఆదరణ

2లో

# కిరికిరి అధికారులు.. రూటే సెప'రేటు'



**తూర్పుగోదావరి , కిర్లంపూడి(జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో భూగర్భ గనులశాఖ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. రోజూ రాత్రులు వందల కొద్ది ట్రిప్పుల గ్రావెల్ మట్టి తవ్వుకుపోతూ ఉంటే ఇక్కడ అటువంటిదేమిలేదని జిల్లా అధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చి ఎవరినో కాపాడాలని చూస్తున్నారు గనులు, రెవెన్యూ అధికారులు. దీని వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావట్లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తవ్వకాలకు సమీపంలోనే సుమారు 100 మందికి పైబడి జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఉన్నారు. వారికి రక్షణ, భరోసా లేదు. వందల మీటర్లు పొడవున చెరువు గట్టును తవ్వేస్తూ నామరూపాలు లేకుండా చేసేస్తుంటే అసలు ఇక్కడ అటువంటిదేమిలేదని అధికారులు తేల్చేసిన

2లో

## తిరుమలలో 'అవినీతి దుకాణాలు'

• వివరాలు 2లో

# రోగులకు నాసిరకం భోజనం

- ముఖ్యమంత్రి కార్యాలయానికి అందిన ఫిర్యాదు
- తక్షణ విచారణకు ఆదేశం



**ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో ( జర్నలిస్ట్ ఫైల్ ) :** చిమిడిన అన్నం... చాలీచాలని అల్పాహారం... రుచీపచి లేని కూరలు... కందిపప్పే లేకుండా నీళ్ల చారు... ఇదీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న భోజనం తీరు. నాసిరకంగా ఉంటున్న ఈ భోజనం తినలేకపోతున్నామని రోగులు, వారి బంధువులు ఆవేదన చెందుతున్నారు. నాసిరకం భోజనంతో ఆరోగ్యపరంగా రోగులు ఇబ్బందులెదు ర్కొంటున్నారు.

2లో

## ఇదీ హాస్టలా...

# పశువుల దొడ్డా



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలోని కొండాయపాలెం గేటు రహదారి మిలిటరీ కాలనీలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతిగృహం నివాసయోగ్యంగా లేదు. అయినప్పటికీ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఒకప్పుడు 400 మందికి వసతి కల్పించిన ఈ హాస్టల్ నందు ప్రస్తుతం 15(పదో తరగతి విద్యార్థులు వెళ్లిపోగా) మంది విద్యార్థులే ఉన్నారు. పేరుకు 40 గదులు ఉన్నా.. అందులో అయిదే విద్యార్థులకు అనువుగా ఉన్నాయి. మిగిలినవి దెబ్బతిని.. ఉపయోగంలో లేవు. గదుల సమస్యతో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నట్లు సమాచారం. గదుల దుస్థితి, ఇక్కడి వాతావరణాన్ని చూసి.. పిల్లలను చేర్పించడానికి బెంబేలెత్తిపోతున్నారు.. గత మూడేళ్లలో అధికారులు గదులు బాగు చేయించి ఉంటే.. విద్యార్థుల ఆదరణ ఉండేదని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి గదులు బాగు చేయిస్తే.. వచ్చే విద్యా సంవత్సరానికైనా సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# అమ్మేయ్... ముంచేయ్...

- అనుమతులు లేకుండా విచ్చలవిడిగా లేఅవుట్లు
- అక్రమ లేఅవుట్లతో రూ.కోట్లలో వ్యాపారం
- నిండా మునుగుతున్న సామాన్య జనం

**శ్రీకాకుళం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతున్న పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని ఓ లేఅవుట్లో ఒకరు స్థలం కొనుగోలు చేశారు. కొంత కాలం తర్వాత ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేస్తే లే అవుట్ కు అనుమతి లేదని సమాధానం రావడంతో కంగుతిన్నారు. ఇదే పరిస్థితి పట్టణాలు, శివారు పల్లెల్లోని చాలా లేఅవుట్లకు వర్తిస్తుంది. అధికారులు దాడులు చేసి నోటీసులు ఇస్తున్నా కదలిక లేకపోవడంతో కొత్తవి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

జిల్లాలోని పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో లేఅవుట్ల ఏర్పాటులో నిబంధనలు పాటించడం లేదు. కొంతమేర అనుమతి తీసుకుంటున్నా భారీగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాలనుకుంటే నాలా పన్ను చెల్లించాలి. అధికారులు పరిశీలించి జారీ చేసిన ధ్రువపత్రంతో పట్టణ ప్రణాళిక శాఖ లేదా సుడా పరిధిలో లైసెన్స్ సర్వేయర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అనుమతి వచ్చిన తర్వాత విక్రయించాలి. బడి, గుడి, ఆట స్థలం, ఆసుపత్రి వంటి నిర్మాణాలకు తగినంత స్థలం విడిచిపెట్టాలి. చాలాచోట్ల అక్రమంగా లేఅవుట్లు వేస్తూ రూ. కోట్లలో వ్యాపారం చేస్తున్నారు.

లేఅవుట్లు వేస్తున్న వారు సిండికేట్ గా ఏర్పడి నిబంధనలకు పాతర వేస్తున్నారు. అధికారులు తనిఖీలు, పరిశీలనకు వెళ్లినప్పుడు వ్యాపారులు తెర వెనుకకు వెళ్లి సంబంధిత స్థలం రైతు పేరిట ఉందంటూ తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఒత్తిడితో చర్యలు తీసుకునే పరిస్థితి లేకుండా పోతోంది. అధికారులు అక్కడి స్తంభాలు, ఇతర నిర్మాణాలను తొలగించి వచ్చేసిన గంటల



వ్యవధిలోనే లేఅవుట్లు యథాతథంగా సిద్ధమవుతున్నాయి.

జిల్లాలో పలుచోట్ల అక్రమ లేఅవుట్ల ఏర్పాటులో ప్రధానంగా కొందరు అధికారులు తెర వెనుక ఉండి తతంగం నడిపిస్తున్నారు. అధికార దర్పంతో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. మొత్తం విస్తీర్ణంలో కొంతభాగం మాత్రమే అనుమతి తీసుకుంటున్నారు. కొనుగోలుదారులు నిలదీసినప్పుడు అసలు విషయం బయటపడుతుండటంతో తెర వెనుక అధికారులు వారిపై ఒత్తిడి చేస్తున్నారు.

పలాస పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘంలో అధికారిక లెక్కల ప్రకారం 22 లేఅవుట్లు

2లో

# అమ్మో... మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసి... అందరి దృష్టి ఎన్నికల నిర్వాహణ పై కేంద్రీకృతం అయిన ప్రస్తుత తరుణంలో... ఇదే అదనుగా ఇసుల అక్రమ రవాణాను మరింత ప్రొత్సాహిస్తున్నారు అధికారులు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్లు ఇసుక రీచ్లు తనిఖీలు చేసినా ఆగడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. ఇదే అదునుగా ఇసుక మాఫియా చెలరేగిపోతోంది.

కృష్ణా నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. నదీతీరంలో ఉన్న బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో రైతులు మరింత లోతుకు బోరుబావులు తవ్వకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఖరీఫ్ సీజన్ నుంచి వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నందున బోర్ల వాడకం పెరిగింది. ప్రస్తుతం నదీ తీరంలో పండ్లతోటలు, ఉద్యానపంటలు, మొక్కజొన్న సాగులో ఉండటంతో నీటి అవసరాలు ఎక్కువగా ఉన్నాయి. ఇసుక రవాణాకు నదిలో ఏకంగా రహదారులు నిర్మించడంతో ఇవి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో నది దిశ మార్చుకునే ప్రమాదం ఉంది. నదిలో వంతెనల వద్ద తవ్వకాలు చేయడం వల్ల వాటికి కూడా ప్రమాదం పొంచి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిమితికి మించిన లోడుతో లారీలు తిరుగుతుండడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. గోతులు పడిన రహదారుల్లో ద్విచక్రవాహనాల్లో వెళుతున్న పల్లెవాసులు ప్రమాదాల బారిన పడి గాయపడుతున్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని స్థానికులు ఇసుక తవ్వకాలు అడ్డుకుంటే పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు గురిచేస్తున్నారు. అధికారులు సైతం వారికే కొమ్ముకాయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నా వారిలో మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇసుక మాఫియా కృష్ణా నదిలో తవ్వకాలు చేస్తూ దాన్ని తరలించి సొమ్ము చేసుకుంటోంది. అచ్చంపేట, అమరావతి, తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోనూ యథేచ్ఛగా జరుగుతున్నాయి. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మనుషుల చేత మాత్రమే నదిలో ఇసుక తవ్వి తరలించాలనేది నిబంధన తుంగలో తొక్కి భారీ యంత్రాలతో తవ్వకాలు చేసి లారీల్లో తరలిస్తున్నారు. కోనూరు, కేవీపాలెం, మల్లాది, వైకుంఠపురం, గుండెమెడ, పెదకొండూరు, బొమ్మువానిపాలెం, మున్నంగి తదితర రీచ్ నిత్యం తవ్వకాలు జరుగుతున్నాయి. మరోవైపు లెక్కాపత్రం లేకుండా తరలిస్తూ పన్ను ఎగ్గొడుతున్నారు. ఎంత దోచుకుంటే అంత సొమ్ము అన్నట్లు తయారైంది. దుగ్గిరాల మండలం పెదకొండూరులో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండురోజుల క్రితం రాత్రి గ్రామం మీదుగా వచ్చే ఇసుక లారీలను అడ్డుకున్నారు. నదిలో ఐదు భారీ పొక్లెయిన్లు పెట్టి తవ్వకాలు చేయడం వల్ల భారీ గోతులు ఏర్పడి భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వాపోతున్నారు. ఇసుక మాఫియాకు రూ.కోట్లలో కాసుల వర్షం కురుస్తుండటంతో నిలదీసిన స్థానికులపై దాడులు చేయడానికి కూడా వెనుకాడడం లేదు

# దోపిడీకి సాక్ష్యం!



**నెల్లూరు, సంగం ( జర్నలిస్ట్ ఫైల్ ):** సంగంలో కొండ మాటున ప్రభుత్వ భూమిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతుండగా– అధికారులకు తెలిసినా ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత మూడు రోజుల క్రితం కొందరు సంగం వాసులు కలెక్టర్ హరి నారాయణ కు ఫిర్యాదు చేయగా.. ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని గనులశాఖను ఆదేశించారు . అయితే సంబంధిత అధికారులు మాత్రం రెండు ఖాళీ ట్రక్కులను పోలీసు స్టేషన్ కు అప్పగించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

.. సంగం కొండకు దిగువన.. సంగం ఎత్తిపోతల పథకం సమీపంలో.. 350, 351 సర్వే నంబర్లలో 32 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొండ పాదంలో ఉండటం.. ఆ ప్రాంతమంతా రాళ్ల గుట్టలతో నిండి ఉండటంతో.. స్థానికంగా గుట్టలపాడు అంటారు. 1970 దశకంలో ఈ భూమిని బలహీనవర్గాలకు.. ఒక్కొక్కరికి 80 సెంట్ల చొప్పున 40 మందికి పంపిణీ చేశారు. సాగుకు యోగ్యంగా లేకపోవడంతో ఖాళీగా ఉంది.

కలెక్టర్ ఆదేశాలతో రాయల్టీ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో గనులశాఖ సిబ్బంది అత్యంత భారంగా, మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించారు. అప్పటికే అక్కడ ఉన్న ట్రక్కుల్లోని గ్రావెల్ కింద వేయించి.. ఖాళీ వాహనాలను సంగం పోలీసులకు అప్పగించారు. యంత్రాన్ని మాత్రం స్వాధీనం చేయలేదు. తవ్వకాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించిన సమయంలోనూ జామాయిల్ తోటలో యంత్రాలు కనిపించాయి. దీనిపై తహసీల్దారు రమాదేవి వివరణ కోరగా.. గ్రావెల్ తవ్వకాల గురించి తనకు సమాచారం లేదని, సిబ్బందిని అక్కడికి పంపిస్తామని చెప్పారు.

గ్రావెల్ కు గిరాకీ ఏర్పడటంతో.. ఈ ప్రాంతంపై అక్రమార్కుల కన్నుపడింది. అధికారం అండగా.. ఏకంగా యంత్రాలను ఏర్పాటు చేసి గ్రావెల్ కొల్లగొడుతున్నారు. సంగం ఎత్తిపోతల పథకం మీదుగా, సంగం– కలిగిరి రహదారిలో నిరాటంకంగా తరలిస్తున్నారు. ఆ ప్రాంతంలో సుమారు పది అడుగుల లోతున తవ్వేయగా.. అందుకు అక్కడి హద్దురాళ్లు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. భారీ సంఖ్యలో గ్రావెల్ వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. దుమ్ము, ధూళి భారీ ఏర్పడి ఎత్తిపోతల పథకం వద్ద గుడిసెలు ఎరుపురంగులోకి మారాయి. ఎన్నికల నియమావళికి ముందు పగలు, రాత్రి సాగిన ఈ దందా.. కోడ్ అనంతరం రాత్రిళ్లు మాత్రమే సాగిస్తున్నారు. తెల్లవారిన తర్వాత సమీపంలోని జామాయిల్ తోటలో వాహనాలు దాచిపెడుతున్నారు.

# తిరుమలలో 'అవినీతి దుకాణాలు'

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** పవిత్ర తిరుమల క్షేత్రాన్ని అవినీతి అధికారులు తమ అక్రమార్జనకు వేదికగా మార్చేశారు. తితిదే, అటవీ, దేవాదాయ శాఖల పరిధిలో అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహించుకునేందుకు అధికారులే ప్రోత్సాహం అందిస్తూ జేబులు నింపుకొంటున్నారు.. తమను ప్రసన్నం చేసుకున్న వారికి...ప్రధానంగా తితిదే ఆలయాలు, సందర్శనీయ ప్రదేశాలు, మెట్ల మార్గాల్లో పాగా వేయిస్తున్నారు. గత కొంతకాలంగా పెద్దసంఖ్యలో దుకాణాలు ఏర్పాటు చేయించారు. ముగ్గురుఅధికారులు పోటీ పడి దుకాణాల మీద దుకాణాలు ఏర్పాట్లు చేయించారు.



పాపనాశనం పరిధిలో దుకాణాలు ఏర్పాటుకు పెద్దమొత్తంలో వసూళ్లకు తెగబడ్డారు. విషయం తెలిసినా మూడు శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు న్నాయి. పాపనాశనం జలాశయం వద్ద దశాబ్దాలుగా షికారీలు దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. పాపనాశనం తీర్థం, జలాశయం తితిదే ఆధీనంలో ఉండగా చుట్టూ రక్షిత అడవి ఉంది. ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు, దుకాణాలు ఏర్పాటు చేయాలన్నా అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. అయితే అక్కడున్న దుకాణాల్లో తితిదే కొన్ని, అటవీశాఖ అనుమతించినవి మరికొన్ని ఉన్నాయి. ఇటీవల 37 మంది తమకు దుకాణాలు కావాలంటూ, అవినీతి అధికారుల అండతో పీసీసీఎఫ్ కు వినతులు సమర్పించారు. స్థానిక అధికారులు వారి ప్రయత్నాలకు అడ్డుపడినా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అలానే శ్రీనివామంగాపురం – శ్రీవారి మెట్టు మార్గంలో అవినీతి అధికారుల అండతో అలిపిరి నడకమార్గంలో ఏడోమైలు సమీపంలోని అటవీ మ్యూజియం వద్ద అనధికారికంగా కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.

అలిపిరి, శ్రీవారి మెట్టు పరిధిలో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం, దాడుల నేపథ్యంలో అక్కడి దుకాణాలు తొలగించే నేపథ్యంలో తితిదే అధికారులు ఇటీవల ఆరాతీశారు. ఆయా విభాగాల అధికారులు ఎన్ని దుకాణాలకు అనుమతులు ఇచ్చారో వివరాలు పంపడంతో ఇచ్చిన అనుమతులకు వాస్తవానికి పొంతన లేకపోవడం గుర్తించారు. ఇక్కడే అవినీతి అధికారుల గుట్టు బయటపడింది. కొత్తగా దుకాణాలు పెట్టుకోవడానికి తాము ఎక్కడా లైసెన్సులు జారీచేయలేదని జిల్లా అటవీ అధికారి డీఎఫ్వో సతీష్ రెడ్డి తెలిపారు. మిగిలిన విభాగాలు అనుమతులు ఇచ్చిన విషయం తమకు తెలియదన్నారు.

# ఆర్టీసీలో దొంగోడు !

(మొదటి పేజీ తరువాయి)

లభిస్తున్నా.. బస్సుల సంఖ్యను పెంచడానికి సదరు అవినీతి అధికారి ఒప్పుకోవడం లేదట. మరో పక్క తెలంగాణ ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ దూసుకుపోతున్నా మన ఆర్టీసీ అధికారులు కళ్లు తెరవకపోవడం వెనుక రహస్యం ఆ అధికారుకి ప్రైవేట్ ట్రావెల్స్ నుంచి భారీగా మామూళ్ళు అందుతుండమే అంటున్నారు.

**తిరుపతి రూట్ లోనూ అదే కిరికిరి**

గతంలో విశాఖ నుంచి తిరుపతికి ఒక నైట్ రైడర్ సర్వీసును నడిపేవారు. దాన్ని అర్థాంతరంగా తీసేసి రెండు సూపర్ లగ్జరీ బస్సులను నడిపారు. తర్వాత అందులోనూ ఒకటి తగ్గించారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఒక సూపర్ లగ్జరీ బస్సు, తిరుపతి మంగళం డిపో నుంచి ఒక ఇంద్ర సర్వీసు నడుపుతున్నారు. నగరం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరే ఈ బస్సులు మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతికి చేరుకుంటున్నాయి. తిరుమలకు వెళ్లే భక్తులు ఉదయం 5, 6 గంటలకు తిరుపతి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకుంటారు. ఆ సమయం దాటిన తరువాత విశాఖ బస్సులు తిరుపతికి చేరుతుండడంతో పెద్దగా ఆదరణ ఉండడంలేదు. ఆర్టీసీ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ కు సహకరించడానికే సర్వీసులను తగ్గించేయడం, ఉన్నవాటిని సక్రమంగా నడపకుండా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# కిరికిరి అధికారులు.. రూటే సెప'రేటు'

(మొదటి పేజీ తరువాయి)

వైనం ముక్కున వేలేసుకునేలా చేసింది. కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామశివారు కొత్త చెరువు వద్ద జరుగుతున్న తంతు ఇదీ. కొండల ప్రదేశానికి, చెరువుకు మధ్య ఉన్న స్థలాన్ని జగనన్న కాలనీగా ప్రభుత్వం పేదలకు కేటాయించింది. దానికి చేరువలోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. 150 ఎకరాలు పైబడి గర్భం కలిగిన కొత్త చెరువు వర్షాకాలంలో నిండి జగపతినగరం గ్రామాన్ని ముంచెత్తుతుంది. ఆ చెరువుకు రక్షణగా ఉన్న గట్టునే తవ్వేస్తే ఇళ్ల స్థలాలకు ఇక రక్షణ ఎలా అని లబ్ధిదారుల ఆందోళన. చెరువు గట్టు వెంబడి ఫ్యాక్టరీ నీటి అవసరాలకు పైపులైన్ వేసి ఉంది. పైపులైనుకు బారెడు దూరం వరకు అక్రమ తవ్వకాలు సాగాయి. ఇంతమందికి నష్టం కలిగిస్తున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు, రైతులు ప్రశ్నిస్తున్నారు.

**50 అడుగుల వెడల్పున గట్టు తవ్వేశారు**

వేసవిలో చెరువు ఎండిపోవడంతో అక్రమార్కుల పంట పండింది. అటు ప్రత్తిపాడు, ఇటు కిర్లంపూడి, వేలంక తదితర ప్రాంతాలకు చెందిన పలువురు తవ్వకందారులు అవినీతి అధికారుల అండదండలతో గ్రావెల్ తవ్వి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు గట్టును సుమారు యాభై అడుగుల వెడల్పున సుమారు అర కి.మీ. మేర తవ్వేశారు. ఒక ట్రాక్టరు గ్రావెల్ రూ. 4 వేలుకు అమ్ముతున్నారు. టిప్పర్ ద్వారా అయితే రూ. పదివేలు పైబడి తీసుకుంటున్నారు. దీన్ని బట్టి ఇక్కడ కొన్ని వేల క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్తో కూడిన మట్టి మాయమైంది. అంటే ప్రభుత్వానికి చెందిన భూమిలో రూ. లక్షల్లో విలువచేసే గ్రావెల్ను తరలించుకుపోయారు. ఇంత జరుగుతుంటే పోలవరం కాలువ మట్టిని రెండు ట్రాక్టర్లు మాత్రమే తవ్వుకుపోయాయంటూ గనులు, రెవెన్యూ శాఖల అధికారులు ఆర్డీవో, జిల్లా అధికారులకు తప్పుడు నివేదికలు సమర్పిస్తుండడం గమనార్హం. దీనిపై జిల్లా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేస్తే ఎవరిది తప్పో తేటతెల్లమవుతుంది.

# అమ్మేయ్... ముంచేయ్...

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇందులో ఒక్క దానికే అనుమతి ఉంది. ఎల్ఆర్ఎస్ ద్వారా సుమారు రూ. 42 లక్షల మేర ఆదాయం సమకూరింది. అనధికారికంగా మరో 20 వరకు లేఅవుట్లు ఉంటాయని సమాచారం. వార్డు సచివాలయాల పరిధిలో వెలుస్తున్న లేఅవుట్ల యజమానుల వివరాలు లేకపోవడంతో అధికారులు ఎవరికి నోటీసులు ఇవ్వాలనే ఆలోచనతో వెనకడుగు వేస్తున్నారు.

ఆమదాలవలస పురపాలక సంఘంలో రెండు లేఅవుట్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మరో 14 చోట్ల స్థలాలు అనధికారికంగా విక్రయిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్ఆర్ఎస్ ద్వారా పురపాలక సంఘానికి రూ. 21. 58 లక్షల మేర ఆదాయం సమకూరింది.

ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో 25 వరకు అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. పట్టణ పరిధిలో భూముల ధరలు అమాంతం పెంచేసి కాస్త దూరంలో చక్కటి గృహ సముదాయం అంటూ భారీగా ఆర్జిస్తున్నారు. అధికారుల అండ , సహకారం ఉండటంతో ముందు అమ్మేయ్.. తరువాత చూసుకుందాం.. అనే ధోరణిలో ముందుకు సాగుతున్నారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. ఏఎస్ పేటలో ఒకరి భూమిని మరొకరి పేరిట మార్చేసి విక్రయిస్తుండగా సొంత యజమాని లబోదిబోమంటున్నా అధికార యంత్రాంగంలో చలనం లేదు.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఎస్ఆర్ఎస్ కింద 119 దరఖాస్తులు అప్లోడ్ చేయగా 80 అనుమతించారు. 10 దరఖాస్తులను తిరస్కరించారు. అదనపు వివరాలు అవసరమని 29, పరిశీలనలో 11 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎస్ఆర్ఎస్ ద్వారా ఇప్పటివరకు రూ. 4. 26 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

# రోగులకు నాసిరకం భోజనం

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై కొంతమంది ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయగా, విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో ఏలూరు సర్వజన ఆసుపత్రితో పాటు అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు ప్రభుత్వమే ఆహారాన్ని అందజేస్తోంది. ఉదయం రొట్టె, పాలు, మధ్యాహ్నం కూర, పప్పు, సాంబారు, మజ్జిగ, గుడ్డు అదే విధంగా రాత్రికి భోజనం ఇవ్వాలి. ఉదయం అల్పాహారంతో పాటు రెండు పూటలా భోజనానికి ఒక్కో రోగికి ప్రభుత్వం రూ. 80 చెల్లిస్తుంది. బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెబుతున్నా అమలు కావడం లేదు. కేవలం అన్నం, సాంబారు, కూరతో సరిపెడుతున్న పరిస్థితులు కొన్నిచోట్ల నెలకొన్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 300 పడకలుండగా సుమారు 200 నుంచి 250 మంది ఇన్పేషెంట్లు రోజూ భోజనం చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందకపోగా నాసిరకంగా ఉంటోందని రోగులు వాపోయారు.

❍ నూజివీడు ఏరియా ఆసుపత్రిలో సుమారు 50 మంది భోజనం చేస్తున్నారు. సమయానికి అందిస్తున్నా నాసిరకంగా ఉండటంతో ఇంటి దగ్గర నుంచే భోజనం తెచ్చుకుంటున్నామని వాపోయారు.

❍ చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో రోజూ సుమారు 25 మంది భోజనం చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామని చెబుతున్నా ఇక్కడ అమలు కావడం లేదని, ఆహారంలో నాణ్యత లేకపోవడంతో ఇంటి దగ్గర నుంచే తెచ్చుకుంటున్నామని అంటున్నారు.

❍ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో రోజూ సుమారు 50 మంది చికిత్స పొందుతున్నారు. మెనూ మాట ఎలాగున్నా నిర్ణీత పరిమాణం, నాణ్యతగా భోజనం లేదని రోగులు అంటున్నారు.

❍ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 300 పడకలుండగా సుమారు 200 నుంచి 250 మంది ఇన్పేషెంట్లు రోజూ భోజనం చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందకపోగా నాసిరకంగా ఉంటోందని రోగులు వాపోయారు.

# పండగ రోజున మీకు పంచభక్ష పరమాన్నాలు - మాకేమో పస్తులు!

**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉగాది పండగ రోజున కూడా కార్మికులకు పస్తులే అంటూ మంగళవారం సిఐటియు నాయకత్వం ఆధ్వర్యంలో క్లాప్ కార్మికులు వినూత్న రీతిలో మామిడాకులు మెడలో వేసుకొని ప్లేట్లు చేతిలో పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు పట్టణ రెండవ కమిటీల కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు లు మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమైన పండగ ఉగాది అని అలాంటి పండుగ రోజు పస్తులు ఉంటున్న మున్సిపల్ కార్మికులు పారిశుధ్యం ఇంజనీరింగ్ సెక్షన్ వీరితో పాటు ప్రధానంగా కోవిడ్, మలేరియా, గార్బేజ్ క్లాప్ ఆటో డ్రైవర్ల కార్మికులు తమ బాధను వ్యక్తం చేస్తూ మున్సిపల్ ఆఫీస్ ముందు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారని అన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు గతంలో రెడ్డి ఏజెన్సీ ద్వారా 8 నెలల జీతాలు బకాయి ఉండడంతో వారు విధులు ఆపారని, మళ్లీ నూతనంగా వచ్చిన కమిషనర్ మేఘ స్వరూప్ క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు ఇప్పుడు నుంచి కార్పొరేషన్ ద్వారా ఇస్తామని వారిని మళ్లీ విధుల్లోకి తీసుకొని పని చేయించారని తెలిపారు. మళ్లీ జీతం పెండింగ్ ఉండడంతో క్లాప్ ఆటో డ్రైవర్లు వారి కుటుంబ పిల్లలు కూడా పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మలేరియా కార్మికులకు ఈ నెలలో నాలుగు నెలలు జీతాలు బకాయి ఉందని, వారి జీతాలు ఉన్నత అధికారులని అడిగినప్పుడు డిసెంబర్ నెలకి వారి టెండర్ రద్దయిందని చెబుతున్నారని అన్నారు. డిసెంబర్ నెలకి టెండర్ రద్దు అయినప్పుడు ఇప్పటివరకు మీరు వారితో ఎలా పని చేయించుకున్నారని సిఐటియుగా నేతలు ఉన్నతాధికారులని ప్రశ్నించామన్నారు. కోవిడ్ మలేరియా గ్యారేజ్ కార్మికులకు కూడా మూడు నెలల బకాయి వేతనాలు ఉన్నాయని చెప్పారు.



నగరపాలక సంస్థ కమిషనర్ కింద స్థాయి అధికారులకు ఎన్ని దపాలుగా హెచ్చరించినా జీతాల విషయంలో నిర్లక్ష్యం వీడి పని చేయాలని సూచనలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఇంజనీరింగ్ సెక్షన్ అధికారుల పైన పారిశుద్ధం అధికారుల పైన ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు కాలయాపన చేస్తున్నారని వివరించారు. ఉన్నత అధికారులు రాజకీయ నాయకులు ఉగాది పండగ చేసుకుంటూ పంచభక్ష పరమాన్నాలు తింటున్నారు కానీ అనునిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికులు మాత్రం ఉగాది పండుగ రోజున పస్తులు ఉంటున్నారు అంటూ సిఐటియు నాయకత్వం ధ్వజమెత్తింది. ఉన్నత అధికారులకు ఇది సరైన పద్ధతి కాదు అంటూ హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా ఉన్నతాధికారులు కార్మికుల పక్షాన ఉండి రేపటి లోపల కార్మికుల అకౌంట్లో వేతనాలు వేయకపోతే మరింతగా పోరాటాలు చేపడతామని సిఐటియు నాయకత్వం హెచ్చరిస్తుం దన్నారు. ప్రధానంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన 16 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా పారిశుధ్యంలో 50 మంది కార్మికులను తీసుకుంటామని ఇంజనీరింగ్ సెక్షన్ విభాగంలో పదిమందిని కార్మికులు తీసుకొని కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు 15 వేల రూపాయలు వేతనం ఇస్తానని చెప్పి మభ్యపెట్టి మోసం చేశారని కూడా తెలిపారు. మున్సిపల్ ఆఫీస్ ఉన్నత అధికారులు చాలావరకు కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని కార్మికుల కోసం పని చేయని అధికారులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు ఎల్ ముతురాజు, ఎం.నల్లప్ప ట్రెజరర్ నారాయణస్వామి, నగర అధ్యక్ష కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేష్, జిల్లా కమిటీ సభ్యులు మంత్రి వరలక్ష్మి శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు.

# రాజీవ్ చంద్రశేఖర్ అఫిడవిట్పై విచారణకు ఆదేశించిన ఇసి



**తిరువనంతపురం :** కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అఫిడవిట్పై విచారణ చేపట్టాలని సెంట్రల్బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సిబిడిటి)ని ఎలక్షన్ కమిషన్ మంగళవారం అదేశించింది. రూ.680 కోట్లను 2021-22లో 'పన్ను విధించదగిన ఆదాయం'గా ప్రకటించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

తిరువనంతపురం బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజీవ్ చంద్రశేఖర్ తన అఫిడవిట్లో ఆర్థిక స్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఇసికి కాంగ్రెస్ సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపాయి. ఇది ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, భారత శిక్షాస్మృతిని ఉల్లంఘించడమేనని పార్టీ ఫిర్యాదులో పేర్కొంది. దీంతో చంద్రశేఖర్ అఫిడవిట్పై విచారణ చేపట్టాలని సిబిడిటిని ఎలక్షన్ కమిషన్ ఆదేశించినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

నిబంధనల ప్రకారం.. అభ్యర్థులు తమ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం, ఆస్తులు, చరాస్తులు, స్థిరాస్తులు, అప్పుల వివరాలను సమర్పించాల్సి వుంటుంది. వారు తమ జీవిత భాగస్వామి ఆర్థిక వివరాలను కూడా వెల్లడించాల్సి వుంటుంది.

# టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూక్కు తప్పిన ప్రమాదం



నంద్యాల ( జర్నలిస్ట్ ఫైల్ ) : నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎమ్డీ ఫరూక్కు ప్రమాదం తృటిలో తప్పింది. నంద్యాల నుంచి కర్నూలుకు కారులో వెళ్తుండగా పాన్యం మండలం తమ్మరాజుపల్లె దగ్గర ఆయన వాహనం రోడ్డుపై ఉన్న బర్రెలను ఢీకొంది. అయితే ఈ ఘటనలో కారు ఏయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ఫరూక్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఘటన స్థలానికి చేరుకున్న పాన్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితా రెడ్డి తదితరులు.. ఫరూక్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పద్మావతి నగర్ క్రిటికల్ కేర్ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తున్నారు.

# టీడీపీ నేత చంద్రబాబుకు రాజయోగం..

- టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు
- చేబ్రోలు ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న పవన్‌కళ్యాణ్





**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో నేడు జరిగిన ఉగాది వేడుకలలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేతకు ఉగాది పచ్చడి అందించి ఆశీర్వదించారు వేద పండితులు. అనంతరం పంచాంగకర్త మాచిరాజు వేణుగోపాల్.. పంచాంగ శ్రవణం చేస్తూ.. రానున్న ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి.. పొత్తులతో ఏం జరగబోతోంది లాంటి విషయాలను కూడా వెల్లడించారు.

టిడిపి అధినేత చంద్రబాబుకు ఈ ఏడాది కలిసి వస్తుందని తెలిపారు.. చంద్రబాబుకు అధికార యోగం ఉందన్న ఆయన.. త్రిమూర్తులు కలయికతో ఆంధ్రప్రదేశ్‌కి మేలు జరుగుతోందన్నారు.. బ్రహ్మ – నరేంద్ర మోడీ, విష్ణువు – పవన్ కల్యాణ్, ఈశ్వరుడు – చంద్రబాబు.. ఇలా త్రిమూర్తులుగా అభివర్ణించారు..

ఇక, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 128 అసెంబ్లీ స్థానాలు, 24 పార్లమెంట్ సెగ్మెంట్లలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి విజయం సాధించనున్నట్టు పేర్కొన్నారు.. చంద్రబాబు మళ్లీ అమరావతి నిర్మాణం చేపడతారని తెలిపారు. టీడీపీది వృశ్చిక రాశి.. ఈ ఏడాది వృశ్చిక రాశి వారు అనుకున్నది సాధిస్తారని వెల్లడించారు మాచిరాజు వేణుగోపాల్. ఈ కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తో పాటు.. వర్ల రామయ్య తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు

**ఉగాది వేడుకల్లో పవన్‌కల్యాణ్ :** ఉగాది పండుగ సందర్భంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వేడుకల్లో పాల్గొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలులో నిర్వహించిన ఉత్సవాలకు సోదరుడు నాగబాబు, తెదేపా నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నేతలతో కలిసి హాజరయ్యారు. పవన్‌కు వేదపండితులు ఆశీర్వచనం అందించారు.

అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రజలంతా బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. పిఠాపురం నుంచే విజయకేతనం ఎగురవేయబోతున్నామని.. క్రోధి నామ సంవత్సరంలో కూటమి ప్రభుత్వాన్ని స్థాపిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రజలకు మేలు జరగాలని.. రైతులు, మహిళలకు మరింత ప్రోత్సాహం లభించాలన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు రావాలని ఆకాంక్షించారు.

## సీఎం జగన్ దంపతులకు పండితుల వేద ఆశీర్వచనం



**పల్నాడు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులకు ఉగాది పండుగ సందర్భంగా పండితులు వేద ఆశీర్వచనం పలికారు. అనంతరం పండితులు అందించిన ఉగాది పచ్చడిని సీఎం దంపతులు స్వీకరించారు. శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద క్యాంపులోనే కార్యక్రమం జరిగింది. శాలువా కప్పి, అక్షింతలు చల్లి ఆశీర్వాదం ఇచ్చారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ క్రోధి నామ సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని అన్నారు. కొత్త సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## వాలంటీర్లకు రూ 10 వేల గౌరవ వేతనం - చంద్రబాబు



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలుగు వారు గొప్పగా నిర్వహించుకునే పండగ ఉగాది అని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. కొత్త ఏడాదిలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వాలంటీర్లకు తీపికబురు చెప్పారు. తాము అధికారంలోకి రాగానే వారికి రూ. 5 వేలు కాదు.. రూ. 10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని తాము ముందే చెప్పామని వెల్లడించారు. ప్రజలకు సేవచేస్తే.. తాము అండగా ఉంటామని వాలంటీర్లకు తెలిపామని వివరించారు. "మన దశ, దిశ నిర్దేశించుకునే వేడుక.. కొత్త ఉత్సాహం అందించే పండగ ఇది. ఉగాది సందర్భంగా కొత్త లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. ఈ ఏడాదిలో సాధికారత రావాలి. నూతన సంవత్సరంలో ధరలు తగ్గాలి.. సంక్షేమం ఉండాలి. ఉగాది పచ్చడిలో తీపి, వగరు, చేదు.. అన్నీ ఉంటాయి. ఈ ఐదేళ్లలో బకాసురుడిని మించిన పాలన సాగింది. రాష్ట్రంలో కారం, చేదు రుచులే ఉన్నాయి. అశాంతి, అభద్రతాభావం కనిపిస్తున్నాయి. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆదుకున్న పార్టీ తెలుగుదేశం. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకూ నీళ్లు ఇవ్వొచ్చు. సహజ వనరులన్నీ వైసిపి దోపిడీ చేసింది. తెలుగు జాతికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని మనమంతా సంకల్పం తీసుకోవాలి. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి.. ఇదే మన సంకల్పం" అని చంద్రబాబు అన్నారు.

## వైసిపికి మాజీ మంత్రి శమంతక మణి గుడ్ బై



**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాకు చెందిన నేత మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, ఆమె కుమారుడు అశోక్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మధ్యే శమంతకమణి కూతురు యామినీబాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పగా.. ఈ రోజు తన కుమారుడు అశోక్‌తో పాటు వైసీపీకి రాజీనామా చేశారు కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. 1980లో అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇక, 1989–1991 వరకు మంత్రిగా సేవలు అందించారు.. ఆ తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరారు.. ఇక, 2014లో తన కూతురు యామినీబాలకు చంద్రబాబు అవకాశం ఇచ్చారు.. కానీ, 2019 నాటికి రాజకీయాలు మారిపోయాయి. సింగనమల నియోజకవర్గ టికెట్ మరోసారి వారికి దక్కకుండా పోవడంతో.. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్ సమక్షంలో శమంతకమణి, యామినీబాల, అశోక్ వైసీపీలో చేరారు.. కాగా, ఈ ఎన్నికల్లో వైసీపీ నుంచి శింగనమల టికెట్ ఆశించి భంగపడ్డారు యామినీ బాల.. దీంతో, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆమె.. ఈ మధ్యే వైసీపీకి రాజీనామా చేశారు.

కాగా, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా శింగనమల నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు యామినీ బాల. అప్పుడు ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. కానీ, 2019 ఎన్నికల్లో అప్పటిదాకా ఎమ్మెల్యేగా ఉన్న యామినిబాలకు బదులు కొత్తగా వచ్చిన బండారు శ్రావణికి అవకాశం కల్పించారు చంద్రబాబు. ఇక, తన కుమార్తెకు టికెట్ కోసం చివరి వరకు టీడీపీ ఎమ్మెల్సీగా ఉన్న శమంతకమణి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో. టీడీపీకి ఎమ్మెల్సీగా ఉన్న శమంతకమణి, ఆమె కూతురు మాజీ ఎమ్మెల్యే యామిని బాల ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో టీడీపీకి రాజీనామా చేసి సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.. ఇప్పుడు వైసీపీ టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు.

## సిట్ అధిపతి కొల్లిపై బదిలీ వేటు



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కేంద్ర ఎన్నికల కమిషన్ బిగ్ షాక్ ఇచ్చింది. రాష్ట్రం నుంచి సిట్ ఛీఫ్ కొల్లి రఘురామిరెడ్డిని పంపించేసింది. సిట్ చీఫ్‌గా ఉన్న కొల్లి రఘురామిరెడ్డిపై వేటు వేసింది ఈసీ. అసోం పోలీస్ ఎన్నికల పరిశీలకుడిగా నియమించింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు పంపించింది ఎన్నికల సంఘం. ఈసీ ఆదేశాల నేపథ్యంలో కొల్లి రఘురామిరెడ్డి అస్సాం వెళ్లి గువహటి కేంద్రంగా ఆయన పని చేయాల్సి ఉంది.

**చంద్రబాబును అరెస్ట్ చేసింది ఆయనే..** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కళ్లు, చెవులు మొత్తం రఘురామిరెడ్డే అని పోలీస్ వర్గాల్లో భాగా ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో రఘురామిరెడ్డిని ఎన్నికల సంఘం ఇతర విధులకు కేటాయించడం హాట్ డిస్కషన్‌గా మారింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును కొల్లి రఘురామి రెడ్డి అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం సిట్ కార్యాలయం వద్ద కీలక కేసులో హెరిటేజ్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ వివాదం కొనసాగుతున్న క్రమంలోనే రఘురామిరెడ్డి విషయంలో ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది.

## శ్రీశైలం ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న, భ్రమరాంబికా దేవిలను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే ఆలయాల్లో పూజలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా అలంకార దర్శనానికి మాత్రమే భక్తులను అనుతిస్తున్నారు. కాగా, మల్లన్న దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతున్నది. భక్తుల రద్దీతో శ్రీశైలంలోని పురవీధులు కిటకిటలాడుతున్నాయి. శివ నామస్మరణతో శ్రీశైల గిరులు మార్మోగిపోతున్నాయి.

## పాడైపోయిన కోవిడ్ టెస్టుల బస్సు పట్టించుకునేదెవరు ?



**పశ్చిమ గోదావరి, నరసాపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కోవిడ్–19 సమయంలో కరోనా అనుమానితులకు పరీక్షలు నిర్వహించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నరసాపురం పట్టణానికి అన్ని వసతులతో కూడిన బస్సును అందించింది. కరోనా సమయంలో నియోజకవర్గం చుట్టుపక్కల ప్రజలకు బస్సులో కోవిడ్ పరీక్షలు నిర్వహించడానికి ఈ బస్సును ఎంతగానో ఉపయోగించారు. కొన్ని రోజులకు ఈ బస్సును వలంధర్ రేవు సమీపంలో మున్సిపల్ పాఠశాల వద్ద ఉంచారు. కరోనా టెస్టులు ఆర్టీపీసీఆర్, రాపిడ్ టెస్టులు నిర్వహించేవారు. కరోనా ప్రభావం తగ్గిన తర్వాత కూడా అక్కడే నిలిపివేశారు . ఆ తర్వాత పట్టణానికి చివర 25 వార్డులో ఓ లే అవుట్ లో బస్సును ఉంచారు. దాదాపు 4 ఏళ్ల నుండి ఈ బస్సును ఇలాగే వదిలేయడంతో ఈ బస్సు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. లక్షల రూపాయలు విలువ చేసే బస్సు పై అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఈ బస్సు ధ్వంసమైంది. గత ఏడాది పలు అభివఅద్ధి కార్యక్రమాలలో పాల్గనడానికి వచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి సభ కూడా ఈ స్థలం పక్కన జరిగింది. అయినా అధికారులు మాత్రం అప్రమత్తం కాలేదు. బస్సు అక్కడే ఉంది. బాధ్యత వహించాల్సిన అధి కారులు బస్సు ధ్వంసమయ్యి పాడైపోతున్నప్ప టికీ పట్టించు కోవడం లేదని, ప్రజా సొమ్ము పాడైపో తున్నప్పటికీ అధికా రులు పట్టించు కోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎండకు కలి, వానకు తడిచి బస్సు పూర్తిగా పాడయ్యేలోపు బస్సును సురక్షిత ప్రదేశానికి తరలించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. దీనిపై జిల్లా వైద్య శాఖ అధికారి డి. మహేశ్వరరావును వివరణ కోరగా దీనిపై తనకు తెలియదని ఆరా తీస్తానన్నారు.

## త్రిపుల్ ఐటీ విద్యార్థుల ధర్నా



**నూజివీడు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** క్యాంపస్ విడిచివెళ్ళాలంటూ ఆర్జీయూకేటీ యాజమాన్యం ఆదేశాలతో విద్యార్థులు ధర్నాకు దిగారు. ఆర్జీయూకేటీ పరిధి లోని నూజివీడు త్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు తమ అకాడమీ క్యాలెండర్ పూర్తయిన నేపథ్యంలో క్యాంపస్ ను విడిచివెళ్ళాలని క్యాంప స్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ చదువుతున్న దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు మెసేజ్‌లను పంపి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టును, రివ్యూస్‌ను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సదరు ప్రాజెక్టు, రివ్యూస్ సమర్పణకు ఏప్రిల్ 10వ తేదీ చివరి రోజుగా త్రిపుల్ ఐటీ క్యాంపస్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులు సమర్పించేందుకు ప్రస్తుత ఆదేశాలు తమకు ప్రతిబంధకమని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆర్జీయూకేటీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టెక్ జెట్ వంటి టెక్‌ఫెస్టులు కూడా పూర్తికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఒంగోలు, శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో అకడమిక్ క్యాలెండర్ ఏప్రిల్ 25 వరకు అమలు చేస్తుండగా ఇక్కడ ఏప్రిల్ 8వ తేదీ చివరిరోజుగా పేర్కొంటూ క్యాంపస్‌ను విడిచివెళ్ళాలని ఆదేశాలు జారీ చేయటంపై విద్యార్థులు త్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆఫీస్ ఐత్రీ బ్లాక్ వద్ద నిరసన తెలిపారు. అభ్యంతరాలపై ఆర్జీయూకేటీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళి మంగళవారానికి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని, ఆందోళన విరమించాలని త్రిపుల్ ఐటీ సిబ్బంది విద్యార్థులకు నచ్చచెప్పడంతో వారు ఆందోళనను విరమించారు.

## మాపై వైసీపీ దుష్ప్రచారం : వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** నిన్నటికి నిన్న మేము పార్టీ మారుతున్నట్టు వైసిపి వారు ఓ దుష్ప్రచారం చేశారని, ఈ రోజు ఇంకో ప్రచారం చేసి వికృతానందం పొందుతున్నారని నెల్లూరు పార్లమెంటు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆమె భర్త కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వైసిపికి, ఆ పార్టీ నాయకు లకు ప్రజలు తగ్గిన బుద్ధి చెబుతారని అన్నారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం, నార్త్ రాజు పాలెంలో వారు కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, రాజేంద్రరెడ్డి తదితరులు తమపై దుష్ప్రచారం చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబునాయుడు తనను ప్రకటించినప్పటి నుంచి ఇలాంటి ఫేక్ ప్రచారాలు అనేకం చేశారని వివరించారు. ఢిల్లీ నుంచి ఎంపి అభ్యర్థిగా ఇక్కడికి వచ్చిన విజయసాయిరెడ్డి నెల్లూరు జిల్లాకు ఏం చేశారో చెప్పి ఓట్లు అభ్యర్థించాలని డిమాండ్ చేశారు. ఒక మహిళా అభ్యర్థికి ఎమ్మెల్యే సీటు కేటాయిస్తే ఓర్చుకోలేక, ఓటమిని అంగీకరించలేక ఇలా దిగజారుడు రాజకీయాలు చేయడం ఎంత మాత్రం తగదని చెప్పారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై పోటీకి సరైన నాయకుడు లేక వైజాగ్ నుంచి దిగుమతి చేసుకున్న విజయ సాయిరెడ్డి. ఈ రోజు పిచ్చిపిచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శిస్తున్నారన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మేము పార్టీ మారినప్పటి నుంచి వైసిపి నాయకులు చీప్ పాలిటిక్స్ ఆడుతున్నారని విమర్శించారు. ఓడిపోతామన్న భయంతో ఏవేవో ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

## 65వేల ఓట్ల మెజార్టీతో పవన్ గెలుపు..

### భవిష్యవాణి వినిపించిన ఎంపి రఘురామకృష్ణరాజు



**పిఠాపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పిఠాపురం లో పవన్ కల్యాణ్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, జగన్ వచ్చి కూర్చున్నా పిఠాపురంలో పవన్ కు 65 వేల ఓట్ల మెజారిటీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు టీడీపీ నేత, నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు. ఇవాళ పిఠాపురంలో జనసేనానిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ ఇది మర్యాదపూర్వక భేటీ అని వెల్లడించారు. అరాచకశక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దుర్మార్గపు శక్తి నుంచి రాష్ట్రాన్ని బయటపడేసి స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. ఇక పవన్ కల్యాణ్, నాగబాబులతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని రఘురామకృష్ణరాజు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో తాను ఎక్కడ్నించి పోటీ చేసినా పవన్ ప్రచారం చేస్తారని చెప్పారు.

## ముగిసిన 'టెన్త్' మూల్యాంకనం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పదోతరగతి పరీక్షల ప్రశ్నా పత్రాల మూల్యాంకనం ముగిసింది. ఈ నెల ఒకటి నుంచి ప్రారంభమైన మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి తెలిపారు. 26 జిల్లాల్లో హెడ్ క్వార్టర్స్‌లో మూల్యాంకనం జరిగిందని పేర్కొన్నారు. 47,88,738 ప్రశ్నా పత్రాలను 25 వేల మంది సిబ్బందితో పూర్తిచేశామని వెల్లడించారు. మూల్యాంకన కేంద్రాల్లో సిబ్బందికి అవసరమైన అన్ని వసతులూ కల్పించామన్నారు. ఫలితాలను మే మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు.

# కూటమిలో అలకలు...అసంతృప్తులు



**అనకాపల్లి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2019 ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైసిపి విజయం సాధించింది. రానున్న ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు చోట్ల కొత్త వారిని వైసిపి బరిలో దించింది. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతిని మార్చి, ఆ స్థానాన్ని రాజకీయ సమీ కరణల దృష్ట్యా రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు టికెట్ కేటాయించింది. ఈయన ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగుల నుంచి తన కుమార్తె ఈర్లె అనురాధకు టికెట్ కేటాయించారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజ కవర్గ టికెట్ మలసాల భరత్‌కుమార్‌కు కేటా యించి, గుడివాడను గాజువాక పంపించారు. పాయకరావుపేట వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యుడు కావడంతో, ఆయన స్థానంలో రాజాం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే కంబాల జోగులుకు పాయకరావుపేట టికెట్ ఇచ్చింది. యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు బరిలో వున్నారు. యలమంచిలి, మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల్లో వైసిపికి సానుకూలంగా వుంది. పెందుర్తి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేటలో ఇరు పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుంది.

టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో అనకాపల్లి ఎంపీ టికెట్ కడపకు చెందిన సిఎం రమేష్‌కు బిజెపి కేటాయించింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడుచోట్ల జనసేన, నాలుగు స్థానాల్లో టిడిపి అభ్యర్థులు బరిలో వున్నారు. అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల నుంచి జనసేన నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట నుంచి టిడిపి అభ్యర్థులు పోటీలో వున్నారు. జనసేనకు కేటాయించిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టిడిపి నాయకుల్లో అసంతృప్తులు కొనసాగుతున్నాయి. జనసేన లోకి కొత్తగా వచ్చిన పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణకు టికెట్ ఇచ్చి, ఎంత ోకాలంగా పనిచేస్తున్న నాయకులకు టికెట్ ఇవ్వకపోవడంపై జనసేన కార్యకర్తల్లో అసం తృప్తి వుంది. పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు పోటీచేయడంతో సీనియర్ టిడిపి నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అలిగారు. కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగావున్నారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శివశంకర్‌కు టికెట్ ఇవ్వకుండా, కొత్తగా పార్టీలో చేరిన రమేష్ బాబుకు టికెట్ ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు అభ్యంతరం చెబుతున్నారు. అనకాపల్లి జనసేన టికెట్ కొణతాల రామ కృష్ణకు ఇవ్వడంతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఆ నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పరుచూరి భాస్కరరావు మనస్థాపంతో జనసేనకు రాజీనామా చేశారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ టికెట్ కోల్పోయారు. ఎంతో ఆశతో టిడిపిలో చేరిన సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావుకు భంగపాటు తప్పలేదు. యలమంచిలి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు ఈ ఎన్నికల్లో అవమానం జరిగింది. ఈ స్థానం నుంచి జనసేన అభ్యర్థి సుందరపు విజయ కుమార్ పోటీలో వుండడంతో సుదీర్ఘకాలంగా టిడిపిలో పనిచేస్తున్న నాగేశ్వరరావుకు చివరకు బాధ మిగిలింది. మాడుగుల టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావును మార్చే ఆలోచనలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వున్నారు. ఈ నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి కుమార్,మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు టికెట్ ఆశించారు. ప్రసాదరావుకు టికెట్ ఇవ్వడంపై గవిరెడ్డి అనుయాయల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. తాజా పరిస్థితుల రీత్యా ప్రసాదరావు బదులు గవిరెడ్డిని రంగంలోకి దించితే మంచిదన్న యోచనలో చంద్రబాబు వున్నారు. కాంగ్రెస్ నుంచి పాయకరావుపేట, మాడుగుల, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల్లో అభ్యర్థులు బరిలో వున్నారు.

# తెలంగాణా వార్తలు



## తెలంగాణకు వానలు

### వాతావరణశాఖ చల్లటి కబురు

హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

తెలంగాణకు వాతావరణశాఖ చల్లని కుబురు చెప్పింది. రాబోయే నాలుగు రోజులు వర్షాలు కురవనున్నట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. కొన్ని జిల్లాల్లో వడగాలు కూడా వీస్తాయన్నారు. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ ప్రభావంవల్ల వడగాలు ఎక్కువగా ఉండనున్నాయి. దీంతో ఈ రెండు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడి వర్షాలు, ఈదురుగాలు వీయనున్నాయి. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. వేడిగాలులతో ప్రజలు బయటకు కూడా రావడంలేదు. లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల తేదీలు ఏపీకి వానలు చెప్పిన వాతావరణశాఖ దాదాపు రెండు వారాల తర్వాత తెలంగాణలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మూడు నుంచి నాలుగు డిగ్రీలు తగ్గి 40 డిగ్రీల చొప్పున నమోదవుతున్నాయి. సోమవారం హైదరాబాద్ లో 40 కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే సాయంత్రం సమయంలో చల్లని గాలు వీచాయి. దీంతో నగరవాసులంతా ఉపశమనం పొందారు. ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పడతాయని వెల్లడించారు. మరోవైపు ఏపీలో మాత్రం భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. రాష్ట్రవ్యాప్తంగా వడగాడ్పులు వీస్తున్నాయి. ఏప్రిల్ మొదటివారం నుంచే ఇలా ఉందని, మే వస్తే పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో మాత్రం తేలికపాటి జల్లులు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతోంది.

## జిమ్మిక్కులతో అధికారంలోకి రావాలనేది బిజెపి విధానం: జగ్గారెడ్డి



హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) : : జిమ్మిక్కులతో అధికారంలోకి రావాలలనేది మోడీ, అమిత్ షా విధానమని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబం ప్రజలు ఎప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారని.. అధికారం కోసం అడ్డదారులు తొక్కరని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అవగాహన లేదని జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రశాంత్ కిషోర్ ఓ సారి బీజేపీ అంటారని, ఇంకోసారి కాంగ్రెస్ అంటారని.. ఆయన బతుకుదెరువు కోసం సర్వే సంస్థను పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ అధికారంలోకి వస్తారని పీకే చెప్పారని.. కానీ కాంగ్రెస్ గెలిచిందన్నారు.

పీసీసీ చీఫ్ పదవి తాను కోరుకోవడం కొత్త కాదు.. అడగడం తప్పు కాదని ఆయన వ్యాఖ్యానించారు. పీసీసీ మార్పుకు కొంత సమయం ఉందని.. తొందర లేదని మీడియాతో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు కావాలి కదా అంటూ జగ్గారెడ్డి పేర్కొన్నారు. తాను బస్టాండ్‌లో ఉంటానని, ఎక్కాల్సిన బస్సు వచ్చినప్పుడు ఎక్కుతా అంటూ పీసీసీ పదవి పై పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. పీసీసీ, సీఎం ఒక్కరే అయి ఉంటే బాగుంటుందని అలా కొనసాగుతున్నారని పేర్కొన్నారు.



## పల్లె రవి కుమార్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) : : తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్‌కు ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో రవికుమార్ బయటపడ్డారు. ఖైరతాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన మిత్రుడిని పరామర్శించి ఇంటికి తిరిగి వస్తుండగా, తను ప్రయాణిస్తున్న కారు టైర్ కొత్తపేట క్రాస్ రోడ్డు వద్ద పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను, మెట్రో పిల్లర్‌ను ఢీ కొట్టింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో రవి కుమార్‌కు ప్రమాదం తప్పింది. రవి కుమార్, ఆయన మిత్రుడు రాజు, డ్రైవర్ ఖదీర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

## మహా వికాస్ అఘాడీలో ముగిసిన సీట్ల సర్దుబాటు

ముంబయి : మహారాష్ట్రలోని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమి మధ్య సీట్ల సర్దుబాటు పూర్తయింది. మొత్తం 40 లోక్‌సభ స్థానాల్లో ఎవరెన్ని సీట్లలో పోటీ చేయాలనే విషయంలో శివసేన (ఉద్ధవ్ థాకరే వర్గం), ఎన్‌సిపి (శరద్‌పవార్ వర్గం), కాంగ్రెస్ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఈ మేరకు మంగళవారం ఎంవిఎ నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు. శివసేన (ఉద్ధవ్ థాకరే వర్గం) అత్యధికంగా 21 సీట్లలో పోటీ చేయనుండగా, కాంగ్రెస్ 17 స్థానాల్లో, ఎన్‌సిపి (శరద్ పవార్ వర్గం) పది స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ముంబయిలోని మొత్తం ఆరు సీట్లలో ఉద్ధవ్ థాకరేకి చెందిన శివసేన నాలుగు స్థానాల్లో కూడా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. నార్త్‌వెస్ట్, సౌత్ సెంట్రల్, సౌత్, సౌత్ ఈస్ట్ స్థానాల్లో శివసేన (యుబిటి) బరిలోకి దిగుతుండగా, కాంగ్రెస్ నార్త్, నార్త్ సెంట్రల్ స్థానాల్లో పోటీ చేయనుంది.

**భివాండీ, సాంగ్లీ స్థానాలపై ముగిసిన వివాదం**

మొదట భివాండి, సాంగ్లీ స్థానాలను తమకే కేటాయించాలని ఎంవిఎలోని మూడు పార్టీలు పట్టుబట్టాయి. అయితే ఈ రెండు స్థానాలను ఎన్‌సిపి, శివసేన (యుటిబి)లకు కేటాయించారు. సమస్య పరిష్కారమైందని, ఎంవిఎ అభ్యర్థుల విజయం కోసం తమ కార్యకర్తలు పనిచేస్తారని కాంగ్రెస్ నేత నానాపటోల్ పేర్కొన్నారు. నియంతృత్వ బిజెపిని ఓడించడానికి తమ కార్యకర్తలు పూర్తి నిబద్ధతతో పనిచేస్తారని అన్నారు. బిజెపిని తరిమేయడమే తమ లక్ష్యమని, ఇందు కోసం తాము కృషి చేస్తామని అన్నారు. త్వరలో తమ అభ్యర్థులను ప్రకటించనున్నట్లు శరద్ పవార్ తెలిపారు.

## మెట్రో ప్రయాణికులకు 'ఉగాది' కానుక..



హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

నేడు శ్రీ క్రోధి నామ ఉగాది పండగ. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వైభవోపేతంగా ఈ పర్వదినాన్ని జరుపుకొంటోన్నారు. తెల్లవారు జాము నుంచి ఆలయాన్నీ సందడిగా మారాయి. భక్తుల రద్దీ నెలకొంది. దాదాపు అన్ని ఆలయాల్లోనూ పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు శుభవార్త వినిపించారు ప్రయాణికులకు. ప్రయాణికుల నుంచి అత్యంత ఆదరణ పొందిన మూడు ప్రయాణ రాయితీ కార్డులను పొడిగించినట్లు వెల్లడించారు. ఇది తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. . సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ ఆఫ్– పీక్ హవర్ ఆఫర్ కార్డులను ఆరు నెలల పాటు అంటే– సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించారు. అనంతరం అప్పటి పరిస్థితుల ఆధారంగా మరోసారి వాటి కాలపరిమితిని పొడిగించాలా? వద్దా? అనే విషయంపై అధికారులు నిర్ణయం తీసుకుంటారు. నిజానికి– ఈ కార్డుల కాలపరిమితి ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ముగిసిపోయింది. అధికారులు వాటిని వెంటనే పొడిగించలేదు. ప్రయాణికుల నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. 1. సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డు: ఈ కార్డును కొనుగోలు చేయడం ద్వారా ఒకరోజంతా మెట్రో రైలులో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా ప్రయాణం చేయవచ్చు. దీని ధర 100 రూపాయలు. రీఛార్జ్ చేయడానికి అదనంగా 59 రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. విశాఖపట్నం వెళ్లేవారికి ముఖ్య సూచన 2. మెట్రో స్టూడెంట్ పాస్: విద్యార్థుల కోసం ఉద్దేశించిన కార్డు ఇది. 20 ట్రిప్పులకు ఛార్జీని చెల్లించి.. 30 ట్రిప్పుల వరకు వారు రాకపోకలు సాగించవచ్చు. 30 ట్రిప్పుల మేర రాకపోకలు ఉచితంగా లభించినట్టవుతుంది. 3. సూపర్ ఆఫ్– పీక్ హవర్ ఆఫర్: ప్రయాణ ఛార్జీలో 10 శాతం రాయితీని కల్పించే పథకం ఇది. మెట్రో రైలులో మామూలు సమయాల్లో వసూలు చేసే ఛార్జీపై ఆఫ్ పీక్‌లో అంటే రద్దీ లేని సమయాల్లో 10 శాతం రాయితీ ఇస్తారు. స్మార్ట్ కార్డులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. 10 శాతం ప్రయాణించవచ్చు.

## కవితకు షాక్.. జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

**కవిత రిమాండ్‌ను 14 రోజులు పొడిగించిన కోర్టు**

**ఏప్రిల్ 23వ తేదీ వరకు రిమాండ్ పొడిగింపు**

**మార్చి 26 నుంచి తీహార్ జైల్లో ఉన్న కవిత**




హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఉగాది పండుగ సంతోషం కూడా లేకపోయింది. ఆమెకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు భారీ షాక్ ను ఇచ్చింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఆమె రిమాండ్ పొడిగిస్తూ తీర్పును వెలువరించింది. కవిత రిమాండ్ ను పొడిగించాలంటూ ఈడీ చేసిన విన్నపం పట్ల సానుకూలంగా స్పందించిన కోర్టు... రిమాండ్ ను మరో 14 రోజుల పాటు పొడిగించింది. ఏప్రిల్ 23 వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ ను పొడిగిస్తున్నట్లు కోర్టు తీర్పును వెలువరించింది. దీంతో, కవితకు తీవ్ర నిరాశ ఎదురయింది. కవిత తాజా తీర్పుతో కవిత ఈ నెల 23 వరకు తీహార్ జైల్లోనే ఉండనున్నారు. కవిత పెట్టుకున్న మధ్యంతర బెయిల్ పిటిషన్ ను నిన్న కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. లిక్కర్ కేసులో కవితను మార్చి 15వ తేదీన ఈడీ అరెస్ట్ చేసింది. మార్చి 26వ తేదీ నుంచి ఆమె తీహార్ జైల్లో ఉంటున్నారు.

**ఈడీ కోర్టు న్యాయమూర్తికి కవిత లేఖ**

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. తనకు ఎలాంటి ఆర్థికపరమైన లాభం చేకూరలేదని క్లారిటీ ఇచ్చారు. ఈ కేసులో తాను బాధితురాలినని.. లిక్కర్ కేసులో తనను బలిపశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఈడీ కోర్టు న్యాయమూర్తికి నాలుగు పేజీలు లేఖ రాశారు.

తాను తప్పు చేశాననడానికి ఈడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని.. రెండున్నరేళ్ల కేసు విచారణలో ఎలాంటి సాక్ష్యాలు లభించలేదన్నారు. ఈ కేసులో అరెస్ట్ అయిన ఇతర నిందితుల స్టేట్మెంట్‌తో తనను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో మీడియా ట్రైలర్ ఎక్కువ జరుగుతుందని.. సీబీఐ, ఈడీ ఇన్వెస్టిగేషన్ కన్నా మీడియా విచారణ ఎక్కువగా జరుగుతుందన్నారు. తన మొబైల్ నెంబర్‌ను అన్ని ఛానల్‌లో వేసి నా ప్రైవసీకి భంగం కలిగించారని పేర్కొన్నారు. తన రాజకీయ పరపతిని దెబ్బతీసే విధంగా వివరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే నాలుగుసార్లు విచారణకు హాజరయ్యా.. తన బ్యాంకు వివరాలు కూడా ఇచ్చి విచారణకు సహకరించానని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలకు నా ఫోన్లను కూడా అందజేశానని.. కానీ వాటిని ధ్వంసం చేసినట్లు తనపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఈడీ, సీబీఐ నమోదు చేస్తోన్న 95 శాతం కేసులన్నీ విపక్ష నేతలకు సంబంధించినవేనని.. బీజేపీలో చేరిన వెంటనే ఆ కేసుల విచారణ ఆగిపోతుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా విపక్ష నేతలను ఉద్దేశించి 'నోరు మూసుకోకపోతే ఈడీని పంపుతాం' అని బీజేపీ నేతలు అన్నారని గుర్తు చేశారు. లిక్కర్ స్కామ్ కేసు విచారణకు పూర్తిగా సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. తనకు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నానని కవిత లేఖలో విజ్ఞప్తి చేశారు. తరం కొట్టివేసింది.

## ఎస్‌వోసీపై ఏపీ విజ్ఞప్తిని తిరస్కరించిన కృష్ణా ట్రిబ్యునల్




హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్ ): తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ) దాఖలు విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చుక్కెదురైంది. కృష్ణా జలాల పునఃపంపిణీకి కేంద్రం జారీ చేసిన అదనపు విధివిధానాల (టీవోఆర్)పై ఎస్‌వోసీ దాఖలు చేయడానికి జూన్ చివరి వరకు గడువు పొడిగించాలన్న ఏపీ విజ్ఞప్తిని జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 తిరస్కరించింది. గడువు పెంచే ప్రసక్తే లేదని, ఈ నెల 29లోగా ఎస్‌వోసీ దాఖలు చేయాలని ఏపీని ఆదేశించింది. ఆ తేదీ నుంచి రెండు వారాల్లోగా ఎదుటి పక్షం దాఖలు చేసిన ఎస్‌వోసీపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను ఆదేశించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్–1) గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలతోపాటు ఇతర కేటాయింపులను ఏపీ, తెలంగాణ మధ్య పునఃపంపిణీ చేసేందుకు కృష్ణా ట్రిబ్యునల్–2కు అదనపు విధివిధానాలను జారీ చేస్తూ కేంద్రం 2023 అక్టోబరు 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై రెండు రాష్ట్రాలు తమ వాదనలతో ఎస్‌వోసీలు దాఖలు చేయడానికి ట్రిబ్యునల్ తొలుత మార్చి 20 వరకు గడువు విధించింది. దీంతో అదే రోజు తెలంగాణ ఎస్‌వోసీ దాఖలు చేసింది. ఏపీ మాత్రం దాఖలు చేయకుండా.. గడువు పొడిగించాలని కోరుతూ ఈ నెల 4న మధ్యంతర దరఖాస్తును దాఖలు చేసింది. అయితే దీనిని తిరస్కరించిన ట్రిబ్యునల్.. మే 15 నుంచి 17 వరకు తదుపరి విచారణ నిర్వహిస్తామని పేర్కొంది. ఈ మేరకు ట్రిబ్యునల్ సోమవారం ఢిల్లీలో సమావేశమై అదనపు టీవోఆర్‌పై విచారణ నిర్వహించింది. తెలంగాణ తరఫున సీఎస్ వైద్యనాథన్, ఏపీ తరఫున జయదీప్ గుప్తా వాదనలు వినిపించారు.

ఏపీ వాదనలపై తెలంగాణ అభ్యంతరం..

ఏపీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధాన నిర్ణయాలను ప్రకటిస్తూ ఎస్‌వోసీ దాఖలు చేయలేమని ఆ రాష్ట్రం చేసిన వాదనలను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. తెలంగాణ రాష్ట్రంలోనూ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, అయినా తాము ఎస్‌వోసీ దాఖలు చేశామని గుర్తు చేసింది. కేసుల విచారణపై ఎన్నికల కోడ్ ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. కాలయాపన కోసమే ఏపీ గడువు పొడిగింపును కోరుతోందని ఆరోపించింది. చివరిసారిగా గడువును పొడిగించాలని ఏపీ కోరగా, గతంలో కూడా ఏపీ ఇలాగే గడువును పొడిగింప జేసుకుందని తెలంగాణ ఆక్షేపించింది. రెండు పక్షాల వాదనలు విన్న తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా గడువు పొడిగించాలన్న ఏపీ విజ్ఞప్తిని ట్రిబ్యునల్ తిరస్కరించింది. ఇదిలా ఉండగా.. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 1050 టీఎంసీల వాటాలో 798 టీఎంసీలను తమకే కేటాయించాలని ట్రిబ్యునల్‌కు సమర్పించిన ఎస్‌వోసీలో తెలంగాణ విజ్ఞప్తి చేసింది. నిర్మాణం పూర్తయి.. వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలోని ప్రాజెక్టులకు 238 టీఎంసీలు, భవిష్యత్తులో నిర్మించనున్న ప్రాజెక్టులకు 216 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 36 టీఎంసీలు కలిపి మొత్తం 789 టీఎంసీలు కేటాయించాలని నివేదించింది. కనీస మొత్తంగా 75 శాతం లభ్యత (డిపెండబిలిటీ) ఆధారంగా 555 టీఎంసీలు, 65 శాతం లభ్యత ఆధారంగా 575 టీఎంసీలు కేటాయించాలని కోరింది.

## మేడిగడ్డ మరింత కుంగింది!

భూపాలపల్లి ( జర్నలిస్ట్ ఫైల్ ) : : కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పియర్లు, ఏప్రాన్ మరింత కుంగాయి. గత అక్టోబరులో డ్యామేజీ విషయం బయటపడినపుడు ఏడో బ్లాక్‌లోని 19, 20, 21 పియర్లు, వాటికి కింద ఉండే ఏప్రాన్ అడుగున్నర మేర కుంగాయి. తాజాగా నాలుగైదు అడుగుల మేర కుంగినట్లు కనిపిస్తోంది. ఏడో బ్లాక్ పియర్లు రోజురోజుకూ కుంగిపోతున్నాయని, బ్యారేజీ మరింత ప్రమాదంలోకి వెళుతోందని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. పియర్లు, బ్యారేజ్ బే ఏరియా, క్రస్ట్ స్పిల్‌వేలోనూ పగుళ్లు మరింత పెరుగుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం పర్యటించి దెబ్బతిన్న భాగాన్ని అధ్యయనం చేసి వెళ్లిన కొద్ది రోజులకే ఈ మూడు పియర్ల వద్ద ఏప్రాన్ మరింత కుంగినట్లు తెలుస్తోంది. దెబ్బతిన్న పియర్లను పరిశీలించేందుకు సోమవారం మేడిగడ్డను సందర్శించిన సీపీఎం బృందంతోపాటు వెళ్లిన మీడియా ప్రతినిధులకు పియర్లు మరింత కుంగిపోయిన దృశ్యం స్పష్టంగా కనిపించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ బృందం, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేల బృందం పర్యటించిన సందర్భాల్లో పియర్లు, ఏప్రన్ల వద్ద అడుగున్నర మాత్రమే కుంగిపోయి ఉంది. మార్చి 7 నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల పరిశీలన సమయంలోనూ దాదాపుగా అదే తీరుగా కనిపించింది. నెల రోజుల తర్వాత సోమవారం పరిశీలించినపుడు ఎక్కువగా కుంగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తాజాగా ఏప్రన్లతో పాటు బ్యారేజీ బేఏరియాలోను పగుళ్లు ఏర్పడుతూ ఉండడం గమనించాల్సిన విషయం. దెబ్బతిన్న ఏప్రన్ మరమ్మతులో భాగంగా మొత్తంగా ఏడో బ్లాక్‌ను తొలగించి పునర్నిర్మిస్తే తప్ప బ్యారేజీ నిలబడదని ఇంజనీర్లు చెబుతున్నారు. అయితే, మరమ్మతుల కోసం నిపుణుల బృందం సూచించిన మేరకు నిర్మాణ సంస్థ బ్యారేజీకి ఎగువ భాగంలో నీటికి అడ్డుగా వేసిన మట్టి కట్ట నుంచి కూడా నీటి ఊటలు ఎక్కువగా వస్తున్నాయి. ఇలా నీరు లీకేజీ జరిగితే దెబ్బతిన్న అప్రాన్‌కు మరింత నష్టం చేకూరే అవకాశం ఉందని చెబుతున్నారు.



## సీఎం రేవంత్‌కు బిజేపీతో కాదు.. కాంగ్రెస్‌తోనే ప్రమాదం: కిషన్ రెడ్డి

హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) : తనను పదవి నుండి తప్పించేందుకు కుట్ర జరుగుతోందంటూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి కుట్ర వ్యాఖ్యలపై తాజాగా కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి స్పందించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ% సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీతో ఎలాంటి అపాయం లేదని.. ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుంచే ప్రమాదం పొంచి ఉంటుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మేం ఎలాంటి డిస్టబెన్స్ చేయమని స్పష్టం చేశారు. ఐదేళ్ల తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో భారీ మెజార్టీతో మోడీ ప్రభుత్వం మరోసారి ఏర్పడబోతోందని జోస్యం చెప్పారు.



## ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు వైరల్ గా మారాయి. అటు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఉగాది నుండి కాలచక్రం తిరిగి మొదలౌతుందని, చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుందని.. వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుండే ప్రారంభిస్తారు. అందువల్ల ఉగాదిని వ్యవసాయ నామ సంవత్సరంగా పిలుచుకోవడం ప్రత్యేకత అని చెప్పారు.

## పండుగ పూట పోలీస్ శాఖలో విషాదం..రాజీవ్ రతన్ కన్నుమూత



హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్): పండుగ వేళ రాష్ట్ర పోలీస్ శాఖలో విషాదం నెలకొంది. సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ కన్నుమూశారు. మంగళవారం ఉదయం ఛాతినొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన హుటాహుటిన నగరంలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో ఆయన మృతి చెందారు. కాగా, 1991వ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రాజీవ్ రతన్.. ప్రస్తుతం తెలంగాణ విజిలెన్స్ డీజీగా పని చేస్తున్నారు. రాజీవ్ రతన్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ హఠాన్మరణంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తీవ్ర గుండెపోటుతో ఏఐజీ ఆసుపత్రిలో మృతి చెందారు. 1991 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన రాజీవ్ రతన్ సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల మేడిగడ్డ ప్రాజెక్టుపై ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విచారణకు ఆయనే సారథ్యం వహించారు. గతంలో ఆయన కరీంనగర్ ఎస్పీ గా, ఫైర్ సర్వీసెస్ డీజీగా, పని చేశారు. హైదరాబాద్ రీజియన్ ఐజీగా, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా వివిధ హోదాల్లో పని చేశారు. సుదీర్ఘ కాలంగా తెలంగాణ రాష్ట్రంలో పోలీసు విభాగానికి ఆయన అందించిన విశిష్టమైన సేవలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమర్థవంతంగా, నిజాయితీగా విధులు నిర్వహించిన అధికారులను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదని అన్నారు. రాజీవ్ రతన్ మృతి పట్ల ముఖ్యమంత్రి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సిద్దిపేట జిల్లాలో 106 మంది ఉద్యోగుల సస్పెన్షన్

సిద్దిపేట ( జర్నలిస్ట్ ఫైల్ ) : సిద్దిపేట జిల్లాలో 106 మంది ప్రభుత్వ ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారు. రెండ్రోజుల క్రితం మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి సమావేశంలో పాల్గొన్నారట 106 మంది ప్రభుత్వ ఉద్యోగులు. అయితే.. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సభలో పాల్గొండడంతో ఎన్నికల కమిషన్, సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

ఈ తరుణంలోనే.. వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారికి ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇక ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సమావేశంలో పాల్గొన్న 106 మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారు జిల్లా కలెక్టర్ మను చౌదరి. అటు ఇప్పటికే మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ సుడా చైర్మన్ రవీందర్ రెడ్డిపై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## అప్రూవర్లుగా ఇద్దరు!

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం**

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరు పోలీసు అధికారులు కీలకంగా మారనున్నారు! అవసరమైతే కేసులో వారి పాత్రను బట్టి, నిందితులుగా చేర్చి, ఆ తర్వాత అప్రూవర్లుగా మార్చే దిశలో దర్యాప్తు అధికారులు అడుగులు వేస్తున్నారా? ఈ ప్రశ్నలకు అత్యంత విశ్వసనీయవర్గాలు అవుననే చెబుతున్నాయి. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్‌రావు కూడా వారిద్దరి పేర్లను వెల్లడించినా.. దర్యాప్తు అధికారులు కనీసం నోటీసులు ఇచ్చి, వారిని విచారించిన దాఖలాలు లేవు. దీన్ని బట్టి.. రిటైర్ అయ్యాక కూడా ఎస్ఐబీలో ఓఎస్డీలుగా కొనసాగుతున్న ఆ ఇద్దరు అధికారులు కీలక సాక్షులుగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. వారిద్దరూ సాక్ష్యం చెప్పడానికి సిద్ధపడ్డాకే.. దర్యాప్తు అధికారులు ఈ కేసులో టెలిగ్రాఫ్ చట్టాన్ని జోడించినట్లు (ఆల్టర్) తెలుస్తోంది. నిజానికి ఈ కేసులో ప్రణీత్‌రావును విచారించడానికి ముందే.. దర్యాప్తు అధికారులు ఆ ఇద్దరు ఓఎస్డీల ద్వారా పలు జిల్లాల్లోని వార్‌రూమ్‌లు, ఏడు ప్రాంతాల్లో ట్యాపింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది.

ఈ కేసులో నిందితులకు పక్కాగా శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు ముందుకు సాగుతున్నారు. నిజానికి ఇప్పటి వరకు అరెస్టయిన అధికారులు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, వేణుగోపాలరావు విచారణలో "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అని మాత్రమే పేర్కొన్నారు. అయితే.. ట్యాపింగ్ వ్యవహారానికి సూత్రధారి ఎవరు? అనేది తెలియాలంటే.. ప్రభాకర్‌రావు అరెస్టవ్వాల్సిందే. ఆయన విచారణలోనే గత ప్రభుత్వంలో ఎవరు తనతో ట్యాపింగ్ చేయించారు? ఇక్విపమెంట్ కొనుగోలుకు నిధులు సమకూర్చిందెవరు? అనే వివరాలు వెలుగులోకి వస్తాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు వారిద్దరినీ నిందితులుగా చూపించి, ఆ తర్వాత అప్రూవర్లుగా మారే అవకాశం కల్పిస్తారని సమాచారం.



## ఇడి అరెస్టును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. దీంతో ఆయన జ్యుడీషియల్ కస్టడీ ముగిసేంతవరకు తీహార్ జైలులోనే ఉండాల్సి వుంది.
ఇడి అరెస్టును చట్ట విరుద్ధంగా పేర్కొనలేమని జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ అరెస్టును చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా లేదని కోర్టు అభిప్రాయపడింది. రిమాండ్‌ను చట్టవిరుద్ధంగా పరిగణించలేమని జస్టిస్ శర్మ తీర్పు వెలువరించారు. హవాలా డీలర్లు, ఈ కేసులో అప్రూవర్లుగా మారిన వారి వాంగ్మూలాలు, గోవా ఎన్నికలలో ఖర్చు కోసం నగదు రూపంలో చెల్లించేలా చట్టాన్ని రూపొందించినట్లు సూచించిన స్వంత అభ్యర్థుల స్టేట్ మెంట్లుతో పాటు ఇడి అన్ని నివేదికలను అందుబాటులో ఉంచిందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది.
తన అరెస్టుతో పాటు ఇడి కస్టడీని కూడా కేజ్రీవాల్ ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ఇడి తనను అరెస్టు చేసిన సమయాన్ని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ చర్య ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు, రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణానికి విరుద్ధమని కేజ్రీవాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.




## 'విచార్ వాపస్'.. కాంగ్రెస్‌లో చేరిన కేంద్ర మాజీ మంత్రి బీరేందర్ సింగ్

**న్యూఢిల్లీ:** హర్యానా బీజేపీ మాజీ నేత, కేంద్ర మాజీ మంత్రి చౌదరి బీరేందర్ సింగ్ , ఆయన భార్య ప్రేమలత సింగ్ మంగళవారంనాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హర్యానాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు రణదీప్ సింగ్ సూర్జేవాలా, పవన్ ఖేరా, పలువురు మద్దతుదారుల సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బీరేందర్ సింగ్ మాట్లాడుతూ, హర్యానా రాజకీయాల్లో ప్రజలతో తాము మమేకమ్యయాయమని, ప్రజలు కూడా తమకు మద్దతుగా నిలిచారని చెప్పారు. ఈరోజు పార్టీలోకి తిరిగి రావడం సొంతింటికి తిరిగి రావడం మాత్రమే కాదని, సిద్ధాంతాల పునరాగమనమని అని చెప్పారు. "నేను కాంగ్రెస్ నుంచి లీవ్ తీసుకున్నారు. అందుకు సోనియాగాంధీకి క్షమాపణ తెలియజేశాను. కొన్ని కారణాల వల్ల నేను బీజేపీలోకి వెళ్లాల్సి వచ్చిందని ఆమెకు వివరించాను" అని తెలిపారు.



## సీఈసీ రాజీవ్‌కుమార్‌కు 'జడ్' కేటగిరి భద్రత

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సాయిధ కమెండోలతో జడ్-కేటగిరి భద్రతను కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఎన్నికల నేపథ్యంలో సీఈసీకి ముప్పు పొంచి ఉందంటూ కేంద్ర భద్రతా సంస్థల నివేదిక ఆధారంగా కేంద్ర హోం శాఖ తాజా భద్రత కల్పించింది.
'జడ్' కేటగిరి భద్రత కింద సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన 40 నుంచి 45 మంది సిబ్బంది సీఈసీ రక్షణ విధుల్లో ఉంటారు. దేశ వ్యాప్తంగా ఆయన ఎక్కడ పర్యటించినా ఆయన వెంట ఈ సిబ్బంది ఉంటారు. 1984 బ్యాచ్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన కుమార్ 2022 మే 15వ తేదీన భారతదేశ 25 ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఏప్రిల్ 19వ తేదీతో మొదలై 7 విడతల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగునుంది.



## అన్నాడీఎంకే ఆరిపోయే దీపం

చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకి ఎందుకనో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేపై ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ పార్టీ ఆరిపోయే దీపమని, కనుకనే ఈ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పెద్ద వెలుగు ప్రసరిస్తున్నట్లు ప్రజలకు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్ ఎన్డీయేపై అవాకులుచెవాకులు పేలుతున్నారని, వీలయినంత త్వరగా ఆయన మెదడును పరీక్షించుకుంటే మంచిదంటూ చురక అంటించారు. కోయంబత్తూరు శరవణపట్టిలో సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తాంబరం వద్ద పట్టుబడిన నగదుకు తనకు సంబంధం లేదని బీజేపీ శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారని, ఆ నగదు స్వాధీనంపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కోయంబత్తూరులో అంతర్జాతీయ క్రీడా మైదానం ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి నాలుగు అంతర్జాతీయ స్థాయి క్రీడామైదానాలు అవసరమని అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖకు సమర్థుడైన నాయకుడు లేడని, అన్నామలై రెడీమేడ్ నాయకుడని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ చేసిన విమర్శపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూన్ నాలుగు తర్వాత ఆ పార్టీ ఏమవుతుందో ఓపిక పట్టండి, ఆరిపోయే దీపం కదా అందుకే ఇంత వెలుగు అని ఎద్దేవా చేశారు. శ్రీపెరుంబుదూరు డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలుకు మద్దతుగా ప్రచారం చేస్తూ కమల్ బీజేపీ మూడోసారి అధికారం ఇస్తే నాగ్‌పూర్ దేశ రాజధాని అవుతుందని, ఏకమతం కలిగిన దేశంగా మారుతుందని విమర్శించడంపై కూడా అన్నామలై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కరువు నిధులడిగితే కదలరేం..!?



**న్యూఢిల్లీ:** తీవ్ర కరువు, నీటి ఎద్దడితో అల్లాడుతున్న కర్ణాటక జాతీయ విపత్తు సహాయ నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) నిధుల కోసం అభ్యర్థిస్తే కేంద్రం స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిదానికి పేచీ పడే పరిస్థితి రానివ్వొద్దని కోర్టు కేంద్రాన్ని హెచ్చరించింది. కేంద్రానికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తూ పలు రాష్ట్రాలు తమ వద్దకు రావాల్సి వస్తోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కరువు నిధుల విడుదల కోసం ఎన్నిసార్లు కేంద్రాన్ని అభ్యర్థించినా ఫలితం లేకపోవడంతో కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిని విచారణకు స్వీకరించిన జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కరువు ఉపశమనానికి సంబంధించి కేంద్రం వైఖరిని తెలియజేస్తూ స్పష్టమైన ప్రకటనతో తదుపరి విచారణ తేది నాటికల్లా తమ ముందుకు రావాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకిటరమణ, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానుద్దేశించి ధర్మాసనం ఆదేశించింది. కరువు నిధుల కోసం కర్ణాటక చేసిన అభ్యర్థనపై తగాదాపడే దాకా పరిస్థితి రానివ్వొద్దని కేంద్రానికి సూచించింది. ఇటీవల కాలంలో రాష్ట్రాలకు మరీ ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు న్యాయంగా ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా కేంద్రం ఇబ్బందులు పెడుతుండడంతో వేరే గత్యంతరం లేక రాష్ట్రాలు సుప్రీం కోర్టునాశ్రయిస్తున్నాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక ఆర్థిక నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై కోర్టునాశ్రయించాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకున్న సుప్రీం ధర్మాసనం ఇలా వ్యాఖ్యానించింది. "కేంద్రం, రాష్ట్రం మధ్య వివాదం వుండరాదు. వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు రావడాన్ని మేం చూస్తున్నాం." అని పేర్కొంది.
కనివినీ ఎరుగని రీతిలో సంభవించిన వరదలు, తుపాను వంటి రెండు ప్రకృతి విపత్తులను ఎదుర్కొనడానికి అవసరమైన దాదాపు రూ. 38వేల కోట్ల నిధుల జారీ విషయంలో కేంద్రం, తమ పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఇటీవలనే తమిళనాడు ప్రభుత్వం కేంద్రంపై ఫిర్యాదు చేసింది. అలాగే కేరళ కూడా తమ రుణ పరిమితుల వ్యవహారంలో ఏకపక్షంగా జోక్యం చేసుకుంటోందంటూ కేంద్రంపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కేరళను ఆర్థిక ఎమర్జన్సీలోకి నెట్టివేస్తోందంటూ విమర్శించింది.

### తొలిసారి కాంగ్రెస్‌కు ఓటేసే అవకాశం ..

# కోల్పోయిన ఆ నలుగురు



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య భారతదేశంలో ఎన్నో ఎన్నికలు జరిగాయి. అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేసింది. సాధారణంగా గాంధీ కుటుంబానికి చెందిన ఎవరైనా కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో గాంధీ కుటుంబానికి ఓ వింత అనుభవం ఎదురుకానుంది. రాజకీయంగా గాంధీ కుటుంబం అంటే ఇప్పుడు గుర్తొచ్చేది.. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీతో పాటు రాబర్ట్ వాద్రా. ఈ నలుగురికి కాంగ్రెస్ గుర్తుపై ఓటు వేసే అవకాశం లేదు.
పొత్తులో భాగంగా..
ఈ నలుగురు న్యూఢిల్లీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు. మరోవైపు చాందినీచౌక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటర్లుగా ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కుటుంబం చీపురు గుర్తుపై ఓటు వేయలేని పరిస్థితి నెలకొంది. గాంధీ కుటుంబం ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. కానీ హస్తం గుర్తుపై కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయలేరు. దీనికి కారణం ఆప్, కాంగ్రెస్ ఇండియా కూటమిలో ఉండటమే. పొత్తుల్లో భాగంగా న్యూఢిల్లీ సీటులో ఆప్ పోటీ చేస్తోంది. ఇక్కడి నుంచి ఆమాద్మీ అభ్యర్థిగా సోమనాథ్ భారతి పోటీ చేస్తుండగా, బిజెపి అభ్యర్థిగా దివంగత నేత సుష్మా స్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్ ఎన్డీయే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో గాంధీ కుటుంబానికి చెందిన సోనియా, రాహుల్, ప్రియాంక, రాబర్ట్ వాద్రాలు ఆప్ గుర్తైన చీపురుపై ఓటు వేసే అవకాశం ఉంది.
కాంగ్రెస్ కోరినా..
న్యూఢిల్లీ లోక్‌సభ సీటు తమకు కేటాయించాలని చివరి వరకు కాంగ్రెస్ కోరింది. అయితే కాంగ్రెస్ ప్రతిపాదనకు ఆప్ అంగీకరించలేదు. చాందినీచౌక్ సీటును కాంగ్రెస్‌కు కేటాయించారు. ప్రస్తుతానికి చాందినీచౌక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనెట్ మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో పార్టీకే గాంధీ కుటుంబం ఓటు వేస్తుందని, దీనిని పెద్ద సమస్యగా చూడాల్సిన అవసరం లేదన్నారు. చాందినీచౌక్ పార్లమెంట్ స్థానంలో ఆప్ అభ్యర్థి పోటీలో లేకపోవడం వలన కేజ్రీవాల్ కుటుంబం కూడా ఇండియా కూటమి అభ్యర్థికే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు.

# మోడీ మీద పోటీకి ట్రాన్స్‌జెండర్..

**వారణాసి :** వారణాసి నుంచి ముచ్చటగా మూడవసారి ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేస్తున్నారు. ఆయన 2012లో జాతీయ రాజకీయాల్లోకి వచ్చారు %దీఎ: ౧బజు్ఖఎఅ ఐవంఎ ఎ 9ాజూతీ 2024 9:16ాావీ% వారణాసి నుంచి ముచ్చటగా మూడవసారి ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేస్తున్నారు. ఆయన 2012లో జాతీయ రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటిదాకా ఆయన గుజరాత్ నుంచి ఎమ్మెల్యేగా పోటీలో ఉంటూ వచ్చారు. 2014లో తొలిసారి ఆయన ప్రధాని అభ్యర్థిగా వారణాసి నుంచి పోటీ చేస్తే జనాలు బ్రహ్మరథం పట్టారు. ఆ ఎన్నికల్లో ఆయన మీద అరవింద్ కేజ్రీవాల్ పోటీకి దిగారు. ఆయన మీద మోడీకి ఏకంగా 3,71,784 ఓట్ల భారీ మెజారిటీ దక్కింది. ఇక 2019 నాటికి ప్రధాని హోదాలో ఉంటూ మోడీ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు ప్రత్యర్థిగా సమాజ్ వాది పార్టీ నుంచి షాలినీ యాదవ్ పోటీలో ఉన్నారు. ఈసారి. ఈసారి నరేంద్ర మోడీ మెజారిటీ ఏకంగా 4,79,505కి చేరుకుంది. %ూశ్రీంశీ =ఖుం% – బోయింగ్ విమానాలకు ఏమైంది? ఈసారి ఇంజిన్ కవర్ ఊడింది ఇక 2024లో అదే సీటు నుంచి మోడీ పోటీకి దిగుతున్నారు. ఆయన మీద పోటీకి కాంగ్రెస్ అజయ్ రాయ్ ని సిద్ధం చేసింది. ఇక ఇదే వారణాసి నుంచి హిందూ మహాసభ నుంచి హేమాంగి సఖి మాత పోటీ చేస్తూండడం అందరిలో ఆసక్తిని పెంచుతోంది. ఆమె ఒక ట్రాన్స్ జెండర్. అంతే కాదు ఆమె బరోడాలో జన్మించారు. ఆమె ప్రపంచంలోనే భగవద్గీతను బోధిస్తున్న మొట్టమొదటి ట్రాన్స్ జెండర్ కావడం విశేషంగా చూస్తున్నారు. అలాగే ఆమె 2019లో ఆచార్య మహామండలేశ్వర్ గా పట్టాభిషిక్తులు అయ్యారు. %ూశ్రీంశీ =ఖుం% – ఆన్ లైన్ గేమ్ ఉచ్చులో హైదరాబాద్ ఫ్యామిలీ బలి ఆమె హిందూత్వ భావాలు పుష్కలంగా కలిగి ఉన్నారు. ఆమె గొప్ప ఆధ్యాత్మికపరురాలిగా ఉన్నారు. అతి పురాతన ప్రాంతం ఆధ్యాత్మిక నిలయం అయిన వారణాసి నుంచి ఆమె పోటీ ఇపుడు అందరినీ ఆలోచింపచేస్తోంది. ఆమె పోటీతో హిందూత్వ నినాదాన్నే ఊపిరిగా చేసుకుని ముందుకు సాగుతున్న బీజేపీకి ఎంతవరకూ ఇబ్బంది అవుతుంది అన్న చర్చ సాగుతోంది. ఇప్పటిదాకా రెండు ఎన్నికల్లోనూ నరేంద్ర మోడీకి ప్రధాన పోటీదారులుగా ఉన్న ఆప్ కానీ ఎస్పీ కానీ సెక్యూలర్ భావజాలంతో ముందుకు సాగిన వారు. దాంతో హిందూత్వ అన్న నినాదం ఏకమొత్తంగా బీజేపీ పరం అయ్యేది. ఇపుడు హిందూ మహా సభ బీజేపీకి పోటీగా అభ్యర్థిని పెట్టడం అందులో హేమాంగి సఖి మాత వంటి వారు ముందుకు రావడం అంటే ఇపుడు అంతా ఆసక్తిగా దీనిని చూస్తున్నారు. %ూశ్రీంశీ =ఖుం% – తొలివిడతలో ఖతర్నాక్ స్థానాలు ఎన్నంటే? వారణాసిలో ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి అతుల్ రాయ్ ఉన్నా హిందూ మహా సభ పోటీని కూడా తీసి పారేయటానికి లేదు అని అంటున్నారు. బీజేపీ భావజాలంతోనే హిందూ మహా సభ ఉన్నా ఎందుకు ప్రధాని మోడీ పైనే పోటీ పెడుతోంది అన్నది కూడా చర్చగా సాగుతోంది. బీజేపీ హిందూత్వ అజెండా రాజకీయ అజెండా అన్న కారణంతోనే పోటీకి దిగుతోందా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా ఎవరీ హేమాంగ్ సఖి మాత అని నెటిజన్లు ఇపుడు ఆమె కోసం సెర్చ్ చేస్తున్నారు. ప్రపంచంలోనే బలమైన నేతగా ఉన్న మోడీని ఢీ కొనడం అంటే ఆషామాషీ కాదు. సో హేమాంగ్ సఖి మాత ఏ విధంగా తన ప్రచారాన్ని చేస్తారు అన్నది చూడాల్సి ఉంది.

## వేటు పడిన ఐఏఎస్ లకు పోస్టింగులు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో ఇటీవల పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజబాబులకు ఈసీ ఆదేశాలతో స్థాన చలనం కలిగింది. కాగా, ఇప్పుడు వీరికి ఎన్నికలతోఓ సంబంధం లేని శాఖలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసీ ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం వీరికి విధులు కేటాయించింది. లక్ష్మీషాను ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈవోగా నియమించింది. గౌతమిని టీటీడీ జేఈవోగా, రాజబాబును స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమించింది. పలువురు ఇతర ఐఏఎస్ లను కూడా వివిధ పదవుల్లో నియమించింది. మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ గా అంబేద్కర్ ను, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీగా వెంకట్రామిరెడ్డిని, సీసీఎల్ఏ కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు : సిద్ధార్థ నాథ్ సింగ్

విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు.. విశాఖ స్టీల్ ప్లాంటులో పెట్టుబడులు ఆగవు అని బీజేపీ ఏపీ ఎన్నికల సహ ఇంచార్జ్ సిద్ధార్థ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఏపీలో కేంద్ర సంక్షేమ పథకాలు అమలు దాదాపు జరగలేదన్నారు. అమరావతి ఐదు సంవత్సరాలలో రాజధాని కాలేదు.. కానీ, రాబోయే ఐదేళ్లలో అమరావతి రాజధాని అవుతుంది.. పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తవుతుందనే నమ్మకాన్ని సిద్ధార్థ వ్యక్తం చేశారు.



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు.. విశాఖ స్టీల్ ప్లాంటులో పెట్టుబడులు ఆగవని మరోసారి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పునాదులలో లోపాలు జరిగాయని, పోలవరం డిజైన్ మార్పులు చేశారని వెల్లడించారు.
డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నచోటే అభివృద్ధి..
ఇక, అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థుల విషయంలో ఎలాంటి మార్పులు లేవని సిద్ధార్థ నాథ్ సింగ్ అన్నారు. ఉగాది భారతదేశానికి, తెలుగు వారికి చాలా ముఖ్యమైన రోజు అని, ఈ పండుగ ఏపీలో జరుపుకోవడం అద్భుతంగా ఉందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్న చోట సంక్షేమం అమలు చేయడం సాధ్యపడిందని, ఆంధ్రప్రదేశ్ మాత్రం కేంద్ర సంక్షేమ పథకాలు అమలు దాదాపు జరగలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుపుకోసం అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# జాతీయ వార్తలు



## పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ వాహనాలకు జిపిఎస్

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వం- కు మొత్తం 7 దశల్లో జరగనున్నాయి. ఈ ఎన్నికల వేళ %ా% ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. పోలింగ్ కోసం వాడే అన్ని వాహనాలకు జిపిఎస్ లోకేషన్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఓ అధికారి సోమవారం వెల్లడించారు. ఎలక్షన్ సిబ్బందికి అవసరమైన సూచనలు చేశామని అన్నారు. ఎన్నికల సంఘం అధికారి మాట్లాడుతూ %ా%. ఈవీఎం సహా ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించే సమయంలో, ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిని స్ట్రాంగ్‌రూమ్‌లకు తీసుకొచ్చేవరకు పర్యవేక్షించడానికి జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించనున్నామన్నారు. తద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు. ఒకవేళ ఏమైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించామని చెప్పారు. డ్రైవర్లు సహా పోలింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులను ప్రశ్నిస్తామన్నారు.




## తమిళనాడులో ఐటీ-ఈడీ సోదాలు

**తమిళనాడు :** తమిళనాడులో పలువురు నేతలు, సినీ ప్రముఖుల ఇళ్లల్లో ఈడీ ఏకకాలంలో సోదాలు చేపట్టింది. అధికార పార్టీ డిఎంకె కు చెందిన కొందరు నేతలతోపాటు పలువురు సినీ ప్రముఖుల ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనిఖీలు చేపట్టింది. అదే సమయంలో.. మరోవైపు కొందరు వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ఆదాయ పన్నులశాఖ దాడులు కొనసాగిస్తోంది. చెన్నై సహా 35కు పైగా ప్రాంతాల్లో ఈడీ మంగళవారం ఉదయం ఏకకాలంలో సోదాలను నిర్వహిస్తోంది. డిఎంకె బహిష్కృత నేత.. సినీ నిర్మాత జాఫర్ సాదిక్‌కు సంబంధించిన ఆఫీసులతో పాటు, అతనితో పరిచయం ఉన్నవాళ్ల ఇళ్లు, ఆఫీసులకు ఈడీ బృందాలు చేరుకున్నాయి. ఇందులో డిఎంకె నేతలతోపాటు పలువురు సినీ ప్రముఖులు ఉన్నారు. భారీ డ్రగ్స్ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ విచారణలో భాగంగా ఈడీ ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. తాజాగా దర్శక నటుడు అమీర్ ఇంట్లో ఈడీ అధికారులు కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పలువురు డిఎంకె ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. ఎన్‌సిబి నమోదు చేసిన కేసును, మరికొన్ని ఎఫ్ఐఆర్‌లను పరిగణలోకి తీసుకుని సాదిక్, ఇతరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఇదిలా ఉండగా %ా% మరోవైపు.. తమిళనాడులో ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు కొనసాగుతున్నాయి. పొల్లాచ్చిలో ఎంబీఎస్ పౌల్ట్రీ ఫామ్స్ నడుపుతున్న వ్యాపారవేత్తల ఇళ్లలో ఐటి బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. అరుల్‌మురుగన్, శరవణ మురుగన్, ఇళ్లు, కార్యాలయాలు ఉన్నాయి. ఈ సోదాల్లో రూ. 32 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో బిజెపిపై ఆదివాసీల నిరసన

**న్యూఢిల్లీ :** అరుణాచల్‌ప్రదేశ్‌లో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఫిరాయింపు ఎమ్మెల్యేలను లాక్కొని 2019లో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఈసారైనా పుంజుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. గిరిజనులు అధికంగా ఉన్న ఈ ఈశాన్య రాష్ట్రంలో అభివృద్ధి పేరిట వారి మనుగడకే ముప్పు వాటిల్లుతోందని ఆదివాసీలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఇటీవల మణిపూర్‌లో చోటుచేసుకున్న ఘటనలు ఈ ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి.. లోక్‌సభ ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల ఫలితాలపై దేశమంతా ఆసక్తి నెలకొంది. తొలిదశ ఎన్నికల్లో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏప్రిల్ 19న పార్లమెంటుతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలల్లో 169 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. 59 బిజెపి, 23 కాంగ్రెస్, 16 నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి), 23 నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), 29 మంది స్వతంత్ర అభ్యర్థులు తలపడుతున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న అరుణాచల్‌ప్రదేశ్‌లో 2016లో కాంగ్రెస్ సిఎం పెమాఖండుతో సహా 44 మంది ఎమ్మెల్యేలు ఆపార్టీని వీడి పిపిఎ (పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్)లోకి ఫిరాయించారు. బిజెపి వారికి మద్దతు పలికింది. పిపిఎ ముఖ్యమంత్రిగా తిరిగి ఖండూ ప్రమాణస్వీకారం చేశారు. తిరుగుబాటుదారులతో కలిసి బిజెపి చేసిన రాజకీయాన్ని సుప్రీంకోర్టు కొట్టిపారేయడంతో తిరిగి కాంగ్రెస్ నేతృత్వంలో ఖండు సిఎం అయ్యారు. 2019లో ఫిరాయింపుదారులను చేర్చుకుని బిజెపి అధికారంలోకి వచ్చింది.



## టీడీపీ విరాళాల వెబ్ సైట్ ప్రారంభించిన చంద్రబాబు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ విరాళాల కోసం ప్రత్యేక వెబ్ సైట్‌ను తీసుకువచ్చింది. ఈ వెబ్ సైట్ https://tdpforandhra.comను టీడీపీ అధినేత చంద్రబాబు నేడు ప్రారంభించారు. తనవంతుగా రూ. 99,999 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ అభిమానులు, మద్దతుదారులు విరాళాలు ఇవ్వాలని కోరారు. కాగా, విరాళాలు ఇచ్చిన వారికి రసీదు కూడా అందిస్తారు. ఈ వెబ్ సైట్లో రూ. 99, రూ. 999, రూ. 9,999, రూ. 19,999, రూ. 99,999, ఇతర మొత్తాల కోసం ఆప్షన్లు ఇచ్చారు. 18 ఏళ్లకు పైబడిన వారి నుంచే విరాళాలు స్వీకరించనున్నారు. ఆ మేరకు వెబ్ సైట్లోనే ఆధార్ వెరిఫికేషన్ చేయనున్నారు.

# జగన్‌కు ఈసీ షాక్.. మరో ఐపీఎస్ అధికారి బదిలీ



**అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్:** జగన్ కు ఈసీ షాక్‌బీ ఎన్నికల వేళ మరో ఐపీఎస్, సిట్ అధికారి బదిలీ!! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. ఏపీ సిఐడి అధికారులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక ఆరోపణల రచ్చ కొనసాగుతున్న వేళ, సిట్ ఉన్నతాధికారి కొల్లి రఘురామిరెడ్డిని బదిలీ చేసింది ఎన్నికల సంఘం. ఇప్పటికే ఏపీలో అనేకమంది భారీగా ఐఏఎస్ లఏ, ఐపీఎస్ ల బదిలీని చేపట్టింది. ఇక ఇదే సమయంలో తాజాగా ఏపీ సీఎం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ ఐపీఎస్ ,సిట్ అధికారి కొల్లి రఘురామిరెడ్డి ని బదిలీ చేస్తూ ఎలక్షన్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. కొల్లి రఘురామిరెడ్డి ని ఏపీ నుంచి బయటకు పంపిన ఎన్నికల సంఘం ఆయనను అస్సాం ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ గా నియమించింది. కొల్లి రఘురామిరెడ్డి ని అస్సాంలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీస్ పరిశీలకుడిగా నియమించిన ఈసీ, ఆయన గౌహతి కేంద్రంగా ఉంటూ విధులు నిర్వర్తించాల్సిందిగా పేర్కొంది. ఏపీలో కీలక అధికారిగా కొల్లి రఘురామి రెడ్డి అయితే రఘురామి రెడ్డి రాష్ట్రంలో రాజధాని భూములపై దర్యాప్తుకు వేసిన సిట్ బృందాన్ని లీడ్ చేస్తున్నారు. ఏపీలో జరిగిన స్కిల్ డెవలప్మెంట్ కేసులో కూడా చంద్రబాబును అరెస్టు చేసిన అధికారి కూడా రఘురామిరెడ్డి నే. కొల్లి రఘురామిరెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ విభాగంలో కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఔషధ నియంత్రణ మండలి డీజీగా కూడా ఆయన ఉన్నారు. తాజాగా సిట్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ల దహనం ఇక తాజాగా తాడేపల్లి సిట్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్లు దహనానికి సంబంధించి ఏపీలో దుమారం రేగింది. హెరిటేజ్ కు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను తగలబెట్టారని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆరోపణలు గుప్పించారు. అయితే దీనిపై క్లారిటీ ఇచ్చిన కొల్లి రఘురామిరెడ్డి అలాంటిదేమీ లేదని, తగలబెట్టిన పేపర్లన్నీ వేస్ట్ పేపర్ లనీ ఆయన పేర్కొన్నారు.

**జగన్ కు షాక్ ఇచ్చిన ఎన్నికల సంఘం**

కొల్లి రఘురామిరెడ్డి వైయస్ జగన్ కు అత్యంత సన్నిహితంగా ఉండే అధికారి అని ఏపీలోని రాజకీయ వర్గాల్లో టాక్ ఉంది. అందుకే జగన్ ఆయనకు అనేక కీలక బాధ్యతలు అప్పగించారని టాక్. ఇక ఇదే క్రమంలో నిన్న సాయంత్రం ఆయనను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసి వైయస్ జగన్ కు ఊహించని షాక్ ఇచ్చింది.

# సిట్ కార్యాలయంలో పత్రాల కాల్చివేత ఎందుకు?

**మంగళగిరి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్**

సార్వత్రిక ఎన్నిల వేళ తాడేపల్లిలోని ఏపీ సిట్ ప్రధాన కార్యాలయంలో చోటు చేసుకున్న ఒక ఉదంతం సంచలనంగా మారింది. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్నసమాచారం ప్రకారం విపక్ష నేత చంద్రబాబు.. ఆయన తనయుడు లోకేశ్ తోపాటు హెరిటేజ్ కు చెందిన పలుపత్రాలను భారీగా కుప్పపోసి తగలబెట్టినట్లుగా చెబుతున్నారు. ఈ సమాచారంతోపాటు.. ఈ వాదనకు బలాన్ని చేకూర్చే ఫోటోలు ఇప్పుడు సంచలనంగా మారాయి. తాడేపల్లి పాతూరు రోడ్డులోని సిట్ కార్యాలయం ఉన్న అపార్టుమెంట్ ప్రాంగణంలో సోమవారం ఉదయం పది గంటల వేళలో భారీగా పత్రాల్ని కాల్చేసిన వైనం రాజకీయ రగడగా మారింది. మరో 34 రోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగే సమయంలో..ప్రతిపక్ష నేతలపై నమోదైన కేసులకు సంబంధించిన ముఖ్యమైన పత్రాల్ని కాల్చేసినట్లుగా ప్రధాన ప్రతిపక్షం ఆరోపిస్తోంది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించిన ఆధారాల్ని.. హార్డ్ డిస్కులను ధ్వంసం చేసిన చందంలోనే.. ఏపీ సిట్ అధికారులు సైతం వ్యవహరించారన్న ఆరోపణను టీడీపీ వర్గీయులు పెద్ద ఎత్తున చేస్తున్నారు. తెలంగాణలో మాదిరి ఏపీలోనూ కొత్త ప్రభుత్వం ఏర్పడితే ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు వీలుగా ఈ వ్యవహారం నడిచినట్లుగా ప్రచారం సాగుతోంది. తాజాగా తగులబెట్టిన పత్రాల్లో అసలేం ఉన్నాయన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. విపక్షాల వాదన ప్రకారం సిట్ అధిపతి.. ఐజీ కొల్లి రఘురామ్ రరెడ్డి వద్ద పని చేసే సిబ్బంది భారీగా పత్రాల్ని తీసుకొచ్చి అపార్టుమెంట్ ప్రాంగణంలో ఒక మూలన కుప్పగా పోసి నిప్పుపెట్టినట్లుగా తెలుస్తోంది. అమరావతి ఇన్నర్ రింగు రోడ్డు కేసుతోపాటు ఈ కేసులో భాగంగా హెరిటేజ్ సంస్థ.. సిట్ అదనపు ఎస్పీకి రాసిన ప్రతులు లాంటివి ఉన్నట్లుగా చెబుతున్నారు. కాల్చేస్తున్ పత్రాల గురించి స్థానికులు అడగ్గా.. చంద్రబాబుకు సంబంధించిన పత్రాలుగా సిబ్బంది చెబుతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఎక్కడైనా ఇలాంటి పరిస్థితి ఉంటుందా? అన్నది ప్రశ్న. ఎందుకుంటే.. రహస్యంగా సాగాల్సిన పనిని అందరూ చూస్తుండగా ఓపెన్ గా ఎందుకు చేస్తారు? అన్నదిఒక ప్రశ్న అయితే ఒకవేళ పత్రాల్ని కాల్చేస్తున్న వేళ స్థానికులు సిట్ ఆఫీసుకు వచ్చి.. పత్రాల్ని కాల్చే వారిని ప్రశ్నిస్తే.. వారు సమాధానం చెప్పటమా? ఇది జరిగే పనేనా అన్న ప్రశ్నను పలువురు వేస్తున్నారు.



ఇదిలా ఉంటే ఈ వ్యవహారంపై సిట్ అధిపతి విడుదల చేసిన ప్రెస్ నోట్ సందేహాలకు సమాధానాలు చెప్పేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిట్ నమోదు చేసిన కేసులకు సంబంధించిన కొన్ని లక్షల పేజీలు జిరాక్సు తీస్తున్నామని.. దీంతో జిరాక్స్ యంత్రాలు వేడెక్కాయని.. కాగితాలు యంత్రాల్లో చిక్కుకుపోయి చెడిపోయాయని.. జిరాక్సు మిషన్ లో ఇంకు తగ్గటంతో కొన్ని పత్రాలు క్లారిటీగా లేవని.. వాటిని తగలబెట్టామే తప్పించి.. మరేమీ లేదన్న మాటను వివరణగా చెప్పటం గమనార్హం. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవటం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది

# మేం ఏం చేస్తే బాగుంటుంది..

## ఏపీ ప్రజలకు కూటమి పార్టీల ప్రశ్న.. 8341130393 నెంబరుకు స్పందించమని పిలుపు

**అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్ :** "మేం ఏం చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారో చెప్పండి" ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి పార్టీలు సీట్లు పంచుకుని పోటీకి రెడీ అయిన విషయం తెలిసిందే. "మేం ఏం చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారో చెప్పండి"– అని ఏపీలో చేతులు కలిపిన బీజేపీ–జనసేన–టీడీపీల కూటమి ప్రజలకు పిలుపునిచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి పార్టీలు సీట్లు పంచుకుని పోటీకి రెడీ అయిన విషయం తెలిసిందే. త్వరలోనే ఉమ్మడిగా ప్రచారం కూడా చేయాలని భావిస్తున్నాయి. దీనికి సంబంధించి షెడ్యూల్‌ను కూడా ఖరారు చేసుకుంటున్నాయి. ఇదిలావుంటే.. కూటమి పార్టీల ఎన్డీయే ప్రభుత్వం ఏపీలో ఏర్పడితే.. ఏం చేయాలని ప్రజలు భావిస్తున్నారో చెప్పాలని కూటమి ప్రజలకు పిలుపునిచ్చింది. కూటమి పార్టీల అంచనా ప్రకారం.. ఏపీలో ఈ మూడు పార్టీల కలయికపై ప్రజలకు చాలానే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క సమస్య ఉన్న నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని ప్రజలు ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటున్నారు. ఈ విషయం అటు జనసేన అధినేత పవన్ చేపట్టిన వారాహి యాత్రల్లో బయటపడింది. ఇక, చంద్రబాబు చేపట్టిన బాదుడే బాదుడు యాత్రల్లోనూ ప్రజల ఆకాంక్షలు వినిపించాయి. అదేవిధంగా బీజేపీ నాయకులకు కూడా ఒక అవగాహన ఉంది. అందుకే.. తాము ఉమ్మడిగా కలిసి అధికారంలోకి వస్తే.. ప్రజలు ఏం చేయాలని కోరుకుంటున్నారనేది వారి ప్రశ్న. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ.. కూటమి పార్టీలు ఉమ్మడిగా...మేం ఏం చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారో చెప్పండి అని రాష్ట్ర ప్రజలకు తాజాగా పిలుపునిచ్చారు. అంతేకాదు.. ఒక ఫోన్ నెంబరును కూడా ఇచ్చాయి. 8341130393 నెంబరుకు మిస్డ్‌కాల్, వాట్సాప్, డాక్యుమెంట్, మెసేజ్ రూపంలో ఏదో ఒక విధంగా ప్రజలు తమ ఆకాంక్షలను, సమస్యలను.. తెలపాలని కోరాయి. వీటిని తాము త్వరలోనే ప్రజల ముందు ఉంచనున్న మేనిఫెస్టోలో ఉమ్మడిగా పేర్కొంటామని ఆయా పార్టీల నాయకులు తెలిపారు. తాజాగా విజయవాడలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు.. భేటీ అయి.. మేనిఫెస్టోపై చర్చించారు. ఈ క్రమంలో ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకుని... ఆ తర్వాత మేనిఫెస్టోలో పెట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఫోన్ నెంబరును అందుబాటులోకి

# మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం : కనకమేడల

**ఢిల్లీ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పెన్షనర్ల శవాలను అడ్డుపెట్టుకొని.. రాజకీయం చేసి వైసీపీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని, అందుకే అందుకే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్మన్ అరుణ్ కుమార్ మిశ్రాను.. కనకమేడల రవీంద్ర కుమార్ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఆయన ఏపీకి సంబంధించిన పలు సమస్యలను మానవహక్కుల కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కనకమేడల రవీంద్ర కుమార్ మాట్లాడుతూ



పంచాయతీ సెక్రటరీలు నేరుగా పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్లు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పిందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పింఛన్‌దారులు అందర్నీ ఆఫీసులకు పిలిచి.. ఎలాంటి వసతి, సదుపాయాలు లేకుండా ఇబ్బంది గురి చేశారని చెప్పారు. ఎలాంటి సదుపాయాలు చేయకపోవడంతో 33 మంది వృద్ధులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ తాము ప్రభుత్వ హత్యలుగానే భావిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, రాజకీయ ప్రయోజనాల కారణంగానే పింఛన్‌దారులు చనిపోయారన్నారు. జగన్ మోహన్ రెడ్డి రాజకీయ స్వార్థం కోసమే శవ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

# వైసీపీ పాలనలో ముస్లింలకు భద్రత: బలసాని



**వట్టిచెరుకూరు (గుంటూరు జిల్లా), జర్నలిస్ట్ ఫైల్ :** వట్టిచెరుకూరు మండలంలోని కొర్నేపాడు గ్రామంలో గల మసీద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్ర మాసమని, ముస్లింలు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షను చేసి అల్లాను స్తుతించి ఆయన కృపను పొందటం జరుగుతుందని తెలిపారు., ముస్లింలు ఏర్పాటు– చేసిన రంజాన్ పవిత్రమాస ఇఫ్తార్ విందులో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న మసీద్ లో, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర ఉపవాస దీక్షను చేసిన ముస్లింలకు దీక్ష విరమణ అనంతరం వారికి పండ్లు ఫలహారాలు పంపిణీ చేశారు. రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో ప్రజలంతా సంతోషంగా, సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ– సోదరులు, వట్టిచెరుకూరు మండల, కొర్నేపాడు గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ అధికారంలోకి రాగానే 'చంద్రన్న బీమా'

## డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**నరసరావుపేట, జర్నలిస్ట్ ఫైల్ :** స్థానిక మల్లమ్మసెంటర్లోనున్న భవన నిర్మాణ కార్మికులతో టిడిపి అసెంబ్లి%ు% అభ్యర్థి డాక్టర్ చదలవాడ అ–రవిందబాబు సోమవారం భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నట్లు కూలీలు తెలిపారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని వేడుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్త ఇసుక పాలసీతో భవన నిర్మాణ రంగం కుదేలైందని, ఉపాధి లేక ఇల్లు గడవక తమ కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని వాపోయారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత లేదని, కరోనా సమయంలో ఉపాధి లేక తినడానికి తిండి లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రతి భవన నిర్మాణ కార్మికునికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని వేడుకున్నారు. అనంతరం డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి చంద్రన్న బీమాను అమలు చేస్తామని, ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికులకు ఎప్పుడూ పని ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవన నిర్మాణ కార్మికుడి సొంతింటి కలలు సాకారం చేసే విధంగా ప్రభుత్వం రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతి భవన నిర్మాణ కార్మికునికి ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు.

**టిడిపిలో చేరిన వైసీపీ శ్రేణులు**

స్థానిక ఎస్ఆర్‌కేటీ కాలనీ నుండి 30 కుటుంబాలు, వరవకట్టనుండి 20 కుటుంబాలు, వెంగళరెడ్డి కాలనీ, ఇస్లాంపేటనుండి వంద కార్యకర్తలు టిడిపి చేరారు. ఈ మేరకు వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు టిడిపిలో చేరుతున్నారని నాయకులు తెలిపారు. టిడిపి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అ–రవిందబాబు సమక్షంలో ఆదివారం రాత్రి చేరారు. ఈ సందర్భంగా అరవిందబాబు సదరు కార్యకర్తలకు పసుపు కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి ప్రజలకు అండగా ఉంటుందని, అన్ని సామాజిక వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. తొలుత చిత్రాలయ సెంటర్ నుండి కోటప్పకొండ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు శాఖమూరి మారుతి, షేక్ నాగూర్, షేక్ రఫీ ఆధ్వర్యంలో రాజా, జ్ఞానోజీ, నాగమల్లేశ్వరరావు, నవీన్, విజయలక్ష్మి, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజులంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలి



## కార్పొరేషన్ చైర్మన్ నారాయణ

**మాచర్ల (పల్నాడు జిల్లా),జర్నలిస్ట్ ఫైల్:** రాష్ట్రంలోని ముదిరాజు సంఘీయులందరూ సీఎం జగన్ కు అండగా ఉండాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కే. నారాయణ, డైరెక్టర్ ఎం. స్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాచర్ల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలను, పట్టణ ప్రాంతాలను సోమవారం సందర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ ముదిరాజులకు పెద్దపీట వేశారన్నారు. ముదిరాజులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి తద్వారా సంఘీయుల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముదిరాజులకు రాజకీయ సాధికారతకు బాటలు వేసిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందన్నారు. ఈ క్రమంలో ముదిరాజులందరూ సీఎం జగన్ కు, వైసీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. వైసిపి ప్రభుత్వంతోనే ముదిరాజుల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లేబోయిన రాజు, రాష్ట్ర కోశాధికారి బాలబోయిన పాపారావు, జిల్లా అధ్యక్షులు సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్ :యరపతినేని



**మాచవరం (పల్నాడు జిల్లా జర్నలిస్ట్ ఫైల్):**

ఉగాది పర్వదినం సందర్భంగా గురజాల నియోజకవర్గ ప్రజలకు గురజాల మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు... ఈ సందర్భంగా ఎరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాటతో భ్రష్టు పట్టించాడు... ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని ఏమిటో చెప్పుకోలేని దుర్భర పరిస్థితుల్లోకి రాష్ట్ర ప్రజలను తీసుకువచ్చాడు.... నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థిక సమస్యలతో కొట్టు–మిట్టాడుతున్న గాని అటు–వంటి పరిస్థితుల్లో కూడా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి సోమవారం రాష్ట్రానికి జీవనాడి అయినా పోలవరం నిర్మాణాన్ని పరిశీలిస్తూ పోలవరం నిర్మాణాన్ని పరుగులు పెట్టించి.... అది తక్కువ సమయంలోనే పోలవరం నిర్మాణాన్ని 72 శాతం పూర్తి చేశాడు.... ఇప్పుడు ఆ పోలవరం పూర్తి అయి ఉంటే... కొన్ని లక్షల ఎకరాలకు సాగునీరు..కొన్ని జిల్లాలకు తాగునీరు పుష్కలంగా లభించేది... ఆంధ్ర రాష్ట్రం సస్యశ్యామలమయ్యేది.... రాష్ట్రం ఎక్కడ బాగుపడుతుందోనని జగన్ పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేయలేదు.... ఎంతప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామంటూ ప్రజలను పూర్తిగా పేదరికంలోకి నెట్టాడు... రాష్ట్ర అభివృద్ధికి పనికి వచ్చే ఒక పని కూడా చేయలేదు.... వారి శాఖ ఏదో వారికే తెలియనిదా ద్దమ్మలను రాష్ట్ర మంత్రులుగా పెట్టు–కున్నాడు... సహజ వనరులను పూర్తిగా దోచేశాడు... ల్యాండ్, శాండ్,.. వైన్, అన్నింట్లో కొన్ని వేల కోట్ల రూపాయలు ప్రజల నుండి దోచుకున్నాడు... కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి ఆదాయం పెంచుకున్న దుర్మార్గుడు జగన్... ఓటేసిన ప్రజలను నిలువున ముంచాడు... రాష్ట్రంలోని యువత ఎక్కడ ఉద్యోగాలు చేయకుండా... ఉన్న కంపెనీలను తరిమేశాడు... వచ్చే కంపెనీలను రాకుండా చేశాడు... రాష్ట్రంలోని యువత ఉపాధికి ఏమాత్రం అవకాశం లేకుండా చేశాడు... ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదు.. ఎక్కడ అభివృద్ధి అనేది లేదు... ప్రజల జీవితాల్లో ఆనందం లేదు... రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి... సామాన్యుల పైన దాడులు పెరిగిపోయాయి... ఎంతో అభివృద్ధి చెందాల్సిన రాష్ట్రాన్ని జగన్ సైకో మనస్తత్వంతో నాశనం చేశాడు... ఇక రాష్ట్రంలో ప్రజలకు సేవ చేయాల్సిన పోలీసు, రెవెన్యూ లాంటి ప్రభుత్వ కార్యాలయాలు వైసిపి పార్టీ ఆఫీసుగా మారిపోయాయి.. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల కంటే కూడావైసిపి నాయకులు ఎక్కువగా ఉంటు–న్నారు... సామాన్యులు ప్రభుత్వ కార్యాలయాల్లో అడుగుపెట్టలేని పరిస్థితి... రాష్ట్రంలో ఈ అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడి... ఈ ఉగాది నూతన సంవత్సరంలో..రేపు రాబోయే చంద్రన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుంది.. రాష్ట్రంలోని ప్రాజెక్టులను పూర్తి చేసి చంద్రన్న రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాడు.... రాబోయే కాలంలో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకుంటు–న్నానని యా రపతినేని

# ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తాం : కమిషనర్



నరసరావుపేట (పల్నాడు జిల్లా), జర్నలిస్ట్ ఫైల్ : పురపాలక సంఘ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలో సోమవారం మంచినీటి సరఫరాపై మున్సిపల్ కమీషనర్ సి.రవిచంద్రారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అక్కడి వారితో ఆయన తాగునీటి సరఫరాపై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 18 లైన్లు ఉండగా 12 లైన్ల వరకు తాగునీటి సరఫరా జరుగుతుందని, ప్రతి ఇంటి కుళాయి ద్వారా నీరు అందుతుందని తెలుసుకున్నారు. అదేవిధంగా చివరి 6 లైన్లకు మంచినీటి ట్యాంకర్ రెండురోజులకొకసారి సరఫరా చేయడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు. కాలనీ ప్రజలు వేసవి దృష్ట్యా నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య ఉంటే నేరుగా మున్సిపల్ అధికారులతో ఫోన్‌చేసి మాట్లాడాలని, ఫోన్ చేస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనుకూలమైన సమయాన్ని తెలుసుకొని ట్యాంకర్ పంపించాలని సూచించారు. ఈ మేరకు పలువురు అధికారుల ఫోన్ నంబర్లను అక్కడివారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ఓలేటి శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467